
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
బుధవారం 27 నవంబరు 2024



కిరండోల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-కిరండోల్-విశాఖపట్నం రైలుకు రద్దీ ఎక్కువగా ఉన్న కారణంగా అదనపు విస్టా డోమ్ కోచ్ ఏర్పాటు చేస్తున్నట్టు వాల్తేరు డివిజన్ అధికారులు మంగళవారం తెలిపారు. విశాఖపట్నం నుంచి కిరండోల్ వెళ్లే రైలు (08551)కు డిసెంబరు 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, 31 తేదీల్లో అదనపు కోచ్ అందుబాటులో ఉంటుంది. అదేవిధంగా అటు నుంచి అంటే కిరండోల్ నుంచి విశాఖపట్నం వచ్చే రైలు (08552)కు డిసెంబరు 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30, జనవరి 1వ తేదీలలో అదనపు కోచ్ ఉంటుంది.

అవినీతి అనకొండ

ఆదాయానికి మించిన ఆస్తులు ఆర్జించిన జీవీఎంసీ జోన్-2 కమిషనర్ సింహాచలం

- ఏకకాలంలో ఆరు చోట్ల సోదాలు చేసిన ఏసీబీ అధికారులు
- రూ.రెండు కోట్ల విలువైన ఆస్తుల పత్రాలు లభ్యం
- మార్కెట్ విలువ రూ.25 కోట్లుపైనే...
- ఆది నుంచీ ఆరోపణలు
- వైసీపీ ప్రభుత్వంలో తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించుకుని బయటపడిన వైనం



జోన్-2 కమిషనర్ సింహాచలం

విశాఖపట్నం, కొమ్మాది, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-2 కమిషనర్‌గా పనిచేస్తున్న పొందూరు సింహాచలం ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టారనే అభియోగంపై ఏసీబీ అధికారులు కేసు నమోదుచేసి, అరెస్టు చేశారు. అంతకుముందు సింహాచలం నివాసంతోపాటు మధురవాడలోని జోనల్ కార్యాలయం, శ్రీకాకుళం, హైదరాబాద్‌లలోని బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించి రూ.కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.



జోన్-2 కార్యాలయంలో ఏసీబీ అధికారులు



జీవీఎంసీ జోనల్ కమిషనర్ సింహాచలం నివాసంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

సింహాచలం భారీగా ఆస్తులు కూడగట్టారనే సమాచారం అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం అనుమతి తీసుకుని మంగళవారం ఉదయం ఐదు గంటల నుంచి ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు. మధురవాడ వైశాఖి పెరల్ అపార్టుమెంటులోని ఆయన నివాసం, పనిచేస్తున్న జోన్-2 కార్యాలయంతోపాటు సింహాచలం స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కేశవరావుపేటలోని తల్లిదండ్రుల నివాసం, కింతలిలోని అత్తగారి ఇల్లు, కొత్తపేటలోని వియ్యంకుడి ఇల్లు, హైదరాబాద్‌లోని కుమార్తె ఉంటున్న ఇంట్లో విశాఖ, కర్నూల్ రేంజ్ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పేరిట పలుచోట్ల స్థలాలు ఉన్నట్టు గుర్తించారు. అలాగే సింహాచలం మేనల్లుడు పేరుతో కాపులుప్పాడలో 750 గజాల స్థలం ఉంది. అందుకు సంబంధించిన డాక్యుమెంట్ కూడా సింహాచలం ఇంట్లోనే ఏసీబీ అధికారులకు లభ్యమైంది. సోదాల్లో గుర్తించిన ఆస్తుల విలువ డాక్యుమెంట్ ధర ప్రకారం రూ.రెండు కోట్లు కాగా, మార్కెట్ విలువ ప్రకారం రూ.25 కోట్లు పైనే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు.

గుర్తించిన ఆస్తులు...

సింహాచలం పేరుతో :
- మధురవాడలో 270 గజాల స్థలం
- పరదేశిపాలెంలో 400 గజాలు స్థలం
- కాపులుప్పాడలో 200 గజాల స్థలం
- మద్దిలపాలెం కళాభారతి సమీపంలో ఫ్లాట్
- విజయవాడలో ఇంటి స్థలం
- శ్రీకాకుళం జిల్లాలో 13 ఇళ్ల స్థలాలు
- శ్రీకాకుళం జిల్లా కింతలిలో 4.6 ఎకరాల వ్యవసాయభూమి
- ఒక మారుతి బ్రెజ్జా కారు
- 500 గ్రాములు బంగారం
- ఆరు బ్యాంకు అకౌంట్లలో రూ.ఐదు లక్షలు బ్యాలెన్స్
- సింహాచలం మేనల్లుడు పేరుతో కాపులుప్పాడలో 750 గజాలు స్థలం

ఆది నుంచి వివాదాస్పదమే

సింహాచలం పనితీరు మొదటి నుంచి వివాదాస్పదంగా ఉండేదని జీవీఎంసీ అధికారులు కొందరు చెబుతున్నారు. నాలుగేళ్ల కిందట జోన్-5 (జ్ఞానాపురం) కమిషనర్‌గా పనిచేసినప్పుడు తప్పుడు పత్రాలతో ఆస్తి పన్ను అసెస్‌మెంట్‌లు జారీచేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున ముడుపులు అందాయని ప్రచారం జరిగింది. అలాగే జోనల్ కార్యాలయంలో తన ఛాంబర్ ఆధునికీకరణ పేరుతో ... మిగతా 6వ పేజీలో

రుషికొండలో అర్బన్ హాబిటేట్ సెంటర్

రూ.470 కోట్లతో పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మాణం

- కార్పొరేట్, ఐటీ ఆఫీసులకు స్పేస్
- కన్వెన్షన్ సెంటర్స్, క్లబ్ హౌస్, హోటల్, ఇంటర్నేషనల్ ఫుడ్ రెస్టారెంట్స్ ఏర్పాటు
- ప్రణాళిక, డిజైన్లు రూపొందించిన వీఎంఆర్‌డీఏ

హాబిటేట్ సెంటర్‌లో ఓ భవనం నమూనా



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)


మహా విశాఖ నగరాభివృద్ధి సంస్థ పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో కొత్త ప్రాజెక్టులు చేపట్టే ప్రయత్నం చేస్తోంది. శరవేగంతో అభివృద్ధి చెందుతున్న రుషికొండ ప్రాంతంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని 'అర్బన్ హాబిటేట్ సెంటర్' నిర్మాణానికి ప్రణాళికలు, డిజైన్లు రూపొందించింది. విశాఖపట్నంలో ఈ తరహా ప్రాజెక్టు ఇదే మొదటిది కావడం గమనార్హం. ఇందుకు మధురవాడ లా కాలేజీ సమీపాన రుషికొండ రోడ్డులో 8.82 ఎకరాల స్థలాన్ని గుర్తించింది. అందులో రూ.470 కోట్ల వ్యయంతో పీపీపీ విధానంలో ఈ అర్బన్ హాబిటేట్ సెంటర్ నిర్మాణానికి యత్నిస్తోంది.

అర్బన్ హాబిటేట్ సెంటర్ అంటే...?

సిటీలో ఉండే ఆధునిక వాతావరణం అంతా అక్కడ ఉంటుంది. అధిక ఆదాయ వర్గాలకు వృత్తిపరంగా, వ్యక్తిగతంగా అవసరమైనవన్నీ ఉంటాయి. ట్రేడ్ ఫెయిర్లు, ఆర్ట్, కల్చర్ షోలకు, ఎగ్జిబిషన్లకు ఉపయోగపడేలా సౌకర్యాలు కల్పిస్తారు. ఉద్యోగులు, వ్యాపారులకు సౌకర్యంగా ఉండేలా క్లబ్ హౌస్, స్థానిక, అంతర్జాతీయ రుచులతో వంటలు అందించే రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తారు. ఆఫీసు స్పేస్, బిజినెస్ సెంటర్, రీటెయిల్ స్పేస్, ఆడిటోరియం, సెమినార్ హాల్, పార్టీ ఈవెంట్ లాన్స్ ఇలా అనేకం వస్తాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ తరహా సెంటర్ ఉంది. దాని మాదిరిగా ఏర్పాటు చేయాలనేది అధికారుల యోచన.

ఆదాయం ఎలాగంటే..?

కార్పొరేట్, ఐటీ ఆఫీసులకు 42,637 చ.మీ. ... మిగతా 6వ పేజీలో



హాబిటేట్ సెంటర్ నమూనా

మద్యం దుకాణదారుల ఇష్టారాజ్యం

తెల్లవార్లూ అమ్మకం



అక్కయ్యపాలెంలో రాత్రి 10.15 గంటల తర్వాత షట్టర్ సగం తీసి అమ్మకాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో మద్యం దుకాణాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వేళలను ఏమాత్రం పాటించడం లేదు. అయినా ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

జీవీఎంసీ పరిధిలో 155 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ అధికారులు అనుమతులు మంజూరుచేశారు. దుకాణాల్లో ఉదయం పది నుంచి రాత్రి పది గంటలు వరకు మాత్రమే విక్రయాలు చేపట్టాలని ప్రభుత్వం నిబంధన విధించింది. కానీ నగర నడిబొడ్డున ఉన్న కొన్ని దుకాణాల్లో రాత్రి పది గంటల తర్వాత కూడా యథేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నాయి. కొంతమంది దుకాణదారులైతే షట్టర్‌ను సగం దించేసి అర్ధరాత్రి వరకూ విక్రయాలు సాగిస్తున్నారు. మరికొంతమంది వెనుక వైపు తలుపులు, కిటికీల ద్వారా గుట్టుగా విక్రయాలు చేస్తున్నారు. దుకాణాలు నిర్ణీత ... మిగతా 6వ పేజీలో



మద్దిలపాలెం వద్ద రాత్రి 10.30 గంటలకు ఓపెన్ చేసి వున్న వైన్‌షాప్

కేన్సర్‌ను ముందే గుర్తించేలా...

- జిల్లాలో జోరుగా స్ర్కీనింగ్ ప్రోగ్రామ్
- ఈ నెల 14న ప్రారంభించిన వైద్య, ఆరోగ్య శాఖ
- ఇంటి వద్దే నోరు, బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్‌కు సంబంధించిన పరీక్షలు
- పద్దెనిమిదేళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ నిర్వహణ
- సకాలంలో వ్యాధిని గుర్తించి మెరుగైన వైద్య సేవలను అందించడమే ధ్యేయం



కేన్సర్ సర్వేలో భాగంగా వివరాలు సేకరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొద్దికాలంగా కేన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. దీని బారినపడుతున్న వారిలో సుమారు 95 శాతం మంది రెండు, మూడు దశల తరువాతే ఆస్పత్రులకు వస్తున్నారు. దాంతో వారికి మెరుగైన చికిత్స అందించడానికి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇలాంటి ఇబ్బందులకు చెక్ చెప్పాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కేన్సర్ స్ర్కీనింగ్ సర్వేను ప్రారంభించింది.

ఎన్‌సీడీ (నాన్‌కమ్యూనికబుల్ డిసీజెస్) 3.0 పేరుతో ఇంటింటా కేన్సర్ స్ర్కీనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తోంది. సర్వేలో భాగంగా ప్రాథమిక దశలోనే కేన్సర్‌ను గుర్తించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నెల 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన సర్వేలో వేలాది మంది వైద్య సిబ్బంది భాగస్వాములవుతున్నారు. ప్రతిరోజూ ఐదు ఇళ్లకు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. ఇందుకోసం 120 ప్రశ్నలతో కూడిన జాబితాను ఆరోగ్య శాఖ సిబ్బందికి అందించింది. ఈ వివరాలను ఏఎన్‌ఎం ఏపీ హెల్త్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అందులో జీవన స్థితిగతులు, ఆరోగ్య వివరాలు, ఆహార అలవాట్లు, అనారోగ్య సమస్యలు, రక్త పరీక్షలు, షుగర్, బీపీ వంటి ఇబ్బందులకు సంబంధించిన అంశాలు ఉంటాయి. ఈ వివరాలను సేకరించడంతోపాటు నోరు, బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్‌కు సంబంధించిన స్ర్కీనింగ్‌ను ఇంటి వద్దే చేస్తారు. ఈ మూడు కేన్సర్లకు సంబంధించిన ప్రాథమిక పరీక్షను అక్కడే నిర్వహించి, అనుమానం ఉంటే స్థానిక ఆస్పత్రికి తీసుకువెళ్లి మెడికల్ ఆఫీసర్‌కు చూపిస్తారు. వైద్యుడు కూడా కేన్సర్‌గా అనుమానిస్తే మెరుగైన పరీక్షల కోసం కేజీహెచ్‌కు తరలిస్తారు. గ్రామీణ జిల్లాలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ఆశ, ఏఎన్‌ఎం, నగర పరిధిలో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ఈ సర్వే చేస్తారు.

కేజీహెచ్‌లో ఓపీ కేంద్రం

సర్వేలో భాగంగా అనుమానితులుగా గుర్తించిన వారికి పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలు అందించేందుకు కేజీహెచ్ కేన్సర్ విభాగం ఆధ్వర్యంలో ప్రివెంటివ్ అంకాలజీ ... మిగతా 6వ పేజీలో

వార్డు ప్లానింగ్ సెక్రటరీ సస్పెన్షన్

- సుజాతనగర్‌లో అక్రమ నిర్మాణానికి పరోక్షంగా సహకరించారనే అభియోగంపై చర్యలు
- నెల రోజులు కిందటి వరకూ అక్కడ పనిచేసిన టీపీఓ, ఇన్‌చార్జి ఏసీపీలకు షోకాజ్

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణానికి పరోక్షంగా సహకరించారనే అభియోగంపై జోన్-8 పరిధి సుజాతనగర్ వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ సుబ్బలక్ష్మిని సస్పెండ్ చేస్తూ జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సుజాతనగర్‌లో సుమారు 268 చదరపు గజాల స్థలంలో సెల్లార్+గ్రౌండ్+2 ఫ్లోర్ వ్యక్తిగత నివాసగృహం నిర్మాణానికి జీవీఎంసీ నుంచి ప్లాన్ తీసుకున్నారు. భవన యజమాని జీవీఎంసీ జారీచేసిన ప్లాన్‌ను ఉల్లంఘించి అదనంగా మరో మూడు అంతస్థులు నిర్మించేశారు. అధికారులు ఇటీవల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సుజాతనగర్ వెళ్లినప్పుడు అక్రమ భవనం కనిపించింది. అంతతక్కువ స్థలంలో అంతపెద్ద భవన నిర్మాణానికి ప్లాన్ ఎలా జారీచేశారనే ప్లాన్‌ను పరిశీలించగా జీ+2కి అనుమతి ఇస్తే అదనంగా మూడు అంతస్థులు నిర్మించినట్టు తేలింది. దీనిపై వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ సుబ్బలక్ష్మిని అధికారులు వివరణ కోరగా ఆమె నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే నెల రోజులు కిందటి వరకూ అక్కడ పనిచేసిన టీపీఓ డి.తేజేశ్వరరావు, ఇన్‌చార్జి ఏసీపీ సీహెచ్ రఘునాథరావులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలంటూ షోకాజ్ నోటీసు జారీచేశారు. నగరంలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించినా, అలాంటి నిర్మాణాలను గుర్తించినప్పుడు ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం ఇవ్వకపోయినా ప్లానింగ్ సెక్రటరీలపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

ఐపీఎల్‌లో మనోళ్లు ఇద్దరు

- ఒకరు నితీష్, మరొకరు పైలా అవినాశ్

విశాఖపట్నం/ అచ్యుతాపురం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ టోర్నీలో ఈసారి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన ఇద్దరు క్రికెటర్లు ఆడబోతున్నారు. అందులో ఒకరు నగరానికి చెందిన నితీష్‌కుమార్‌రెడ్డి. నితీష్ గత సీజన్‌లోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఎంపికై సత్తాచాటాడు. ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో తాజాగా ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న భారత జట్టుకు ఎంపికయ్యాడు. పెర్త్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో మంచి ఆటతీరు కనబరచాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 41, రెండో ఇన్నింగ్స్‌లో 38 (నాటౌట్) పరుగులు చేశాడు. ఈ నేపథ్యంలో నితీష్‌కుమార్‌రెడ్డిని సన్‌రైజర్స్ యాజమాన్యం కొనసాగించాలని నిర్ణయించుకుంది. నితీష్‌కుమార్‌రెడ్డికి గత సీజన్‌లో రూ.30 లక్షలు ఇవ్వగా, ఈదఫా నాలుగైదు కోట్లు ఇవ్వనున్నట్టు సమాచారం.

ఇక రెండో ఆటగాడు... అనకాపల్లి జిల్లా ... మిగతా 6వ పేజీలో



నితీష్‌కుమార్‌రెడ్డి



పైలా అవినాశ్

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి



కలెక్టరేట్‌లో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ, కర్తవ్యాలను శ్రద్ధతో నిర్వహించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో భవానీ శంకర్, ఏవో ఈశ్వరరావు, పాషా తదితరులు పాల్గొన్నారు.

- మహారాణిపేట, ఆంధ్రజ్యోతి

విమ్స్ డిప్యూటీ డైరెక్టర్‌గా శ్రీనివాస్‌కుమార్

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) డిప్యూటీ డైరెక్టర్‌గా చిట్టూరి శ్రీనివాస్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది. శ్రీనివాస్ కుమార్ కొద్దిరోజులు కిందటి వరకు కేజీహెచ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. పదోన్నతిపై శ్రీకాకుళం రిమ్స్‌కు డీడీగా వెళ్లారు. తాజాగా ప్రభుత్వం అన్ని ఆస్పత్రుల్లో ఖాళీలను సర్దుబాటు చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా శ్రీనివాస్‌కుమార్‌ను విమ్స్ డీడీగా నియమించింది.



శ్రీనివాస్ కుమార్

నగరపాలెం గోస్తనీ తీరంలో పిల్లల పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న దృశ్యం

భీమునిపట్నం (రూరల్), నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం నగరపాలెంలోని గోస్తనీ నది తీరంలో దివీస్ నిర్మించిన పిల్లల పార్కును మంగళవారం ప్రారంభించి గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఇందులో పిల్లలు ఆడుకునేందుకు వివిధ రకాల ఆట వస్తువులు, జారుడు బల్లలు, ఇనుప ఊయల వంటివి సమకూర్చారు. కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక సేవా విభాగం మేనేజరు డి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ పిల్లల కోసం రూ.9 లక్షలతో ఆట వస్తువులు, సిమెంటు బల్లలు, ఇనుప కంచె వంటివి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావులతో పాటు దివీస్ ప్రతినిధులు శ్రీనివాస్, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలి : ఏవో

భీమునిపట్నం (రూరల్) నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు వరి కోతలు కోసి ధాన్యాన్నిఆరు బైట ఆరబెట్టారని దీనిని రైలు మిల్లులకు వెంటనే తరలించాలని వ్యవసాయాధికారి బీఎస్ కోమలి కోరారు. మండలంలోతాటితూరు, నగరపాలెం, మజ్జివలస, మజ్జిపేట, దాకమర్రి తదితర ప్రాంతాలలో వరిపంట వేసిన రైతులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు. వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలు వస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఈ విధంగా సూచిస్తున్నట్టు చెప్పారు.ధాన్యం తడిచిపోతే ఎందుకూ పనికిరావని, అందువల్ల ముందుగానే మిల్లులకు తరలించాలని కోరారు.

రాజ్యాంగ దినోత్సవం

మధురవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మధురవాడ పరిసరాల్లోని పలు పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారుచారు. 1949, నవంబరు 26న భారత రాజ్యాంగాన్ని సభ ఆమోదించిందని వక్తలు తెలిపారు.పలు పాఠశాలల్లో విద్యార్థులు రాజ్యాంగ ప్రతిజ్ఞను చేశారు.

అప్పన్నకు స్వర్ణ తులసీ దళార్చన



అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి వైభవంగా స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. ప్రతినెలా రెండు పక్షాల ఏకాదశి పర్వదినాలలో ఆర్జిత సేవగా స్వర్ణ తులసీ దళార్చన చేస్తారు. ఇందులో భాగంగా మంగళవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేశాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం భక్తుల గోత్ర నామాలతో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శత నామావళిని పఠిస్తూ స్వర్ణ తులసీ దళాలతో అర్చన జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఆ తర్వాత ఇదే వేదికపై స్వామివారి ఆర్జిత కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.4 లక్షల విరాళం

సింహాద్రి అప్పన్న దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన యెర్రి బాల భాస్కరరావు రూ.2.5 లక్షలు, రూ.1.5 లక్షలు కలిపి మొత్తం రూ.నాలుగు లక్షలను తమ కుటుంబ సభ్యుల పేరున విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని మంగళవారం సాయంత్రం ప్రోటోకాల్ విభాగం ఏఈఓ వి.రాంబాబుకు నగదు రూపంలో అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో స్వామివారి దర్శన భాగ్యం కల్పించడంతో పాటు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

మరిడిమాంబ ఆలయంలో చోరీ

మల్కాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం గ్రామ దేవత మరిడిమాంబ ఆలయంలో అమ్మవారి మెడలో బంగారు పుస్తెలతాడును ఓ వ్యక్తి చోరీ చేసిన సంఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఆలయంలోకి భక్తుడిలా ప్రవేశించిన వ్యక్తి గర్భగుడిలోకి వెళ్లి అమ్మవారి మెడలో ఉన్న పుస్తెలతాడును తస్కరించి అక్కడ నుంచి జారుకున్నాడు. అయితే ఈ దొంగతనం దృశ్యం సీసీ కెమెరాలో రికార్డు కావ డంతో ఆలయ నిర్వాహకులు మల్కాపురం క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చోరీకి పాల్పడిన వ్యక్తి గురించి గాలిస్తున్నారు.

క్రీడా స్ఫూర్తితో సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- ఘనంగా ఇంటర్ కళాశాలల వాలీబాల్ పోటీలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా



క్రీడా పోటీలను ప్రారంభిస్తూ బెలూన్లను ఎగుర వేస్తున్న శాసనసభ్యుడు శ్రీనివాసరావు

భీమునిపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం భీమిలి ప్రభుత్వ ఎస్వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో ఆయన ఇంటర్ కళాశాలల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవడం వల్ల జీవితంలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను పరిష్కరించుకునే సామర్థ్యం కలుగుతుందన్నారు. క్రీడాకారులు గెలవాలనే పట్టుదలతో బాటు ఓటమిని తట్టుకునే మనో ధైర్యాన్ని కూడా క్రీడలు అందిస్తాయన్నారు. కెరీర్ ప్లాన్ చేసుకోవడంలో కాలేజీ దశ కీలకమైనదని, భవిష్యత్‌ను అందంగా తీర్చిదిద్దుకోవడానికి విద్యార్థులు కష్టపడాలని సూచించారు. తల్లిదండ్రులు, దేశం గర్వించే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ రెండు రోజుల పాటు సాగే ఈ పోటీల్లో స్త్రీ, పురుష జట్లు 52 పాల్గొన్నాయని, సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. ఈ రెండు రోజులు క్రీడాకారులకు భోజన సదుపాయం అందిస్తున్న కళాశాల పూర్వ విద్యార్థి బోర శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్లు గాడు చిన్నికుమారిలక్ష్మి, లొడగల అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, భీమిలి మండల టీడీపీ అధ్యక్షుడు డీఏఎన్ రాజు, నాయకులు కొప్పల కృష్ణారావు, ఏయూ ఫిజికల్ డైరెక్టర్ విజయమోహన్, ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ హెచ్‌వోడీ పల్లవి, వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి కట్టుబడి ఉంటాం

- విద్యార్థుల ప్రతిజ్ఞ
- పలు పాఠశాలలు, కార్యాలయాల్లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



పద్మనాభం : అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ ఆనందరావు, రెవెన్యూ సిబ్బంది



సింహాచలం : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ నరసింహం

తగరపువలస, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని సంగివలస నర్సింగ్ కళాశాల విద్యార్థినులు మంగళవారంప్రమాణం చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగం గురించి, ఏ పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని భారతదేశంలో తయారు చేశారన్న విషయాలను వివరించారు.కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రాన్సిస్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తగరపువలస బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం అప్పలరాజు, ఉపాధ్యాయులు రమేష్, మల్లిక, సంజీవి పాల్గొన్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం రూరల్ : బడుగు బలహీన వర్గాల జీవనవిధానాన్ని మెరుగుపరిచేలా రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించారని తహసీల్దార్ కె.ఆనందరావు పేర్కొన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఉదయం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంఆర్ఐ శ్యామల, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలంలో..

సింహాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పౌరులందరికీ పలురకాల హక్కులను కల్పించే రాజ్యాంగానికి అంతా కట్టుబడి ఉండాల్సిందేనని ఎంపీపీ స్కూలు హెచ్ఎం రాజేశ్వరి అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు రాజ్యాంగ విశిష్టతలను విశదీకరించి వాళ్లతో ప్రమాణం చేయించారు. భారతదేశానికి డా.బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ఎల్లపుడూ చుక్కానిలా నిలుస్తుందని మహా విశాఖ 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం అన్నారు. రాజ్యాంగ వజ్రోత్సవాన్ని పురస్కరించుకుని వార్డు పరిధిలోని అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం పుష్పమాలిక వేసి నివాళి ఘటించారు.



సంగివలసలో రాజ్యాంగ ప్రమాణం చేస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

కేంద్ర విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆందోళన

తగరపువలస, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు అలంబిస్తోందని ఆరోపిస్తూ సీఐటీయూ కార్యకర్తలు కార్యకర్తలు మంగళవారం తగరపువలస బైపాస్ రోడ్డు వద్ద నిరసన ప్రదర్శన, ర్యాలీ, మానవహారం నిర్వహించారు. చిట్టివలస సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రారంభమై ర్యాలీ అంబేడ్కర్ కూడలి, మార్కెట్ మీదుగా బైపాస్ రోడ్డులో వైఎస్ఆర్ విగ్రహ కూడలి వరకు సాగింది. అక్కడ నిరసన ప్రదర్శన చేసి మానవహారంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర మొండివైఖరిని విడనాడాలన్నారు.

ఈ కార్యక్రమానికి సీఐటీయూ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహించారు. జోన్ కమిటీ నాయకులు ఎస్.అప్పలనాయుడు, ఆర్.నర్సింగరావు, ఆటో యూనియన్ నాయకులు పెంటరాజు పల్ల రమణ, జీవీఎంసీ పారిశుధ్య కార్మిక సంఘ నాయకుల బొడ్డరాజు, సన్నీబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

పద్మనాభం రూరల్, నవంబరు 26 : టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వల్ల గొప్ప రాజకీయ పార్టీతో అనుబంధం కలిగి సామాజిక బాధ్యత నిర్వర్తించిన వారు అవుతారయని, బీమా భరోసా ఉంటుందని భీమిలి ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెపాలలి పెద ఎర్రినాయుడు తెలిపారు. మంగళవారం అనంతవరం, గొల్లలపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ టీడీపీ ప్రజా సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి ప్రాధాన్యమిస్తుందన్నారు.

సభ్యత్వ నమోదుపె పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్.వెంకటరావు, నాయకులు అప్పలసూర్యనారాయణ, తాతాజీ, అప్పలనాయుడు (పోస్టల్), ఎస్.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి ప్రతి గింజ కొనుగోలు చేస్తాం: ఎమ్మెల్యే 'గంటా'

ఆనందపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటాశ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బోని గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతు అంటే అప్పుల్లో పుట్టి, అప్పుల్లో పెరిగి, అప్పుల్లో చనిపోయే వాడనే నానుడిని మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలుస్తుందన్నారు. రైతు కుటుంబంలో పుట్టిన తనకు వారి కష్టాలు తెలుసన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఎనిమిది ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని సేవలను రైతులు వినియోగించుకోవాలని గంటా కోరారు. జేసీ మాయూర్ అశోక్ మాట్లాడుతూ రైతులు ధాన్యం తరలించడానికి 50 వేల గన్నీలు, 100 వాహనాలను సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన టన్నుకు రూ.2,300 మద్దతు ధర కంటే తక్కువకు రైతులెవరూ బయట విక్రయించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సంగీత్ మాథుర్, వ్యవసాయశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంత సందర్శన

సాగర్‌నగర్: గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో భాగంగా రుషికొండలోని గిరిజన పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన గిరిజన సంతను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. ఈ నెల 23న ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. సంతలో గిరిజన ఉత్పత్తులు విక్రయిస్తున్న వారితో ఆయన కాసేపు ముచ్చటించారు. గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై 28 నుంచి 'గీతం'లో అంతర్జాతీయ సదస్సు



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న సదస్సు ఛైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె.గోశ్, తదితరులు

సాగర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్తంగా ఈ నెల 28 నుంచి డిసెంబరు ఒకటి వరకు వ్యర్థాల నిర్వహణ-సర్క్యులర్ ఎకానమీ అనే అంశంపై 14వ అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్టు సదస్సు ఛైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె.గోశ్ తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ సదస్సు కన్వీనర్లు ప్రొఫెసర్ సాయి సుధాకర్, డాక్టర్ సౌదామినిలతో కలిసి మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వివిధ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు, రోజువారి జీవితంలో వినియోగించే ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్, ఆసుపత్రి వ్యర్థాలు వంటివి తిరిగి వినియోగించే రీసైకిలింగ్ పద్ధతులతో కొత్త ఆర్థిక వ్యవస్థను సృష్టించడాన్ని సర్క్యులర్ ఎకానమీ అంటారని వారు పేర్కొన్నారు. సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సర్క్యులర్ ఎకానమీ, ఐపీఎల్ఏ గ్లోబల్ ఫోరమ్-2024 పేరిట జరిగే ఈ సదస్సులో 60 దేశాలకు చెందిన 600 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అలాగే 580 పరిశోధన పత్రాలను నిపుణులు సమర్పిస్తారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 27న స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నామన్నారు. పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన కూడా ఉంటుందని వారు వెల్లడించారు.



సురక్షిత ప్రాంతంలో ఉంచిన బోట్లు

రుషికొండ బీచ్‌లో నిలిచిన బోటు షికార్

సాగర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రుషికొండ బీచ్‌లో ఏపీ టూరిజం నిర్వహిస్తున్న బోటు షికార్‌ను మంగళవారం ఉదయం నుంచి నిలిపివేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నెల 30వ తేదీ వరకు బోటు షికార్‌ను నిలిపివేస్తున్నట్టు పర్యాటకశాఖ అధికారులు తెలిపారు. సముద్రంలో షికార్‌కు వినియోగించే బోట్లను నిర్వాహకులు సురక్షిత ప్రాంతానికి తరలించారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

మధురవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును పలుచోట్ల జోరుగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఏడో వార్డు పరిధి మధురవాడ వాంబే కాలనీలో 295వ బూత్ కన్వీనర్ మల్లువలస రాము ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వాణిజ్య కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు మాట్లాడుతూ గతంలో కంటే వార్డు పరిధిలో రెండింతలు అధికంగా సభ్యత్వాలు నమోదు చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగోతి సూర్యప్రకాశరావు, భవానీ, కొండబాబు, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: గ్రేటర్ 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం ఆధ్వర్యంలో పాత అడవివరం, విజినిగిరిపాలెం టీడీపీ సభ్యత్వ నమోదును చేపట్టారు. సభ్యత్వం తీసుకోవడం వల్ల చేకూరే ప్రయోజనాలను కార్పొరేటర్ వివరించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, పార్టీ బీసీ నాయకుడు గండ్రెడ్డి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తున్న అర్చకులు

రెండో రోజుకు శ్రీవారి పవిత్రోత్సవాలు

సాగర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రుషికొండలోని శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మంగళవారం నాటికి రెండో రోజుకు చేరాయి. ఇందులో భాగంగా ఉదయం పవిత్ర ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే ఉదయం పదిన్నర నుంచి పదకొండున్నర వరకు స్నపన తిరుమంజన సేవను వైభవంగా చేపట్టారు. పూజాది కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళి

భీమునిపట్నం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు పలుచోట్ల నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో హనుమంతరావు ఆధ్వర్యంలో ఇక్కడి అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సన్యాసినాయుడు, ఎంఈవోలు శివరాణి, జయప్రద, తదితరులు పాల్గొన్నారు. అలాగే జోనల్ కార్యాలయంలో జెడ్సీ ప్రసన్నవాణి ఆధ్వర్యంలో, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి జెడ్సీప్రసన్నవాణి ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు రాజ్యాంగ రూపకల్పన గురించి వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆర్.మంజుల ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అంబేడ్కర్ కాలనీలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

అవినీతి అనకొండ

... 5వ పేజీ తరువాయి

పెద్దఎత్తున చందాలు వసూలు చేశారని ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నింటిపై పత్రికల్లో కథనాలు రావడంతో ఆయన్ను విజయనగరం జిల్లా పార్వతీపురం మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో తనకున్న పలుకుబడిని ఉపయోగించుకుని ఆయన కొద్దిరోజులకే తిరిగి జీవీఎంసీకి బదిలీ చేయించుకుని జోన్-6 (గాజువాక) కమిషనర్‌గా పోస్టింగ్ తెచ్చుకున్నారు. అక్కడ పని చేస్తున్నప్పుడు పరిశ్రమలు సామాజిక బాధ్యత కింద గాజువాక ప్రాంతంలో ఖర్చు పెట్టాల్సిన నిధులను జీవీఎంసీ ఖాతాకు కాకుండా తన వ్యక్తిగత ఖాతాలో డిపాజిట్ చేయించుకోవడం వివాదాస్పదమైంది. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో జీవీఎంసీ ఉన్నతాధికారులు విచారణ జరిపారు. కానీ తనకున్న పలుకుబడిని ఉపయోగించుకుని ఆ వివాదం నుంచి బయటపడ్డారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు నిర్మాణంలో ఉన్న భవనాలు కనిపిస్తే వాటి వద్దకు వెళ్లి ప్లాన్‌ను ఉల్లంఘించి నిర్మాణం చేస్తున్నారని, వాటిని కూల్చేయాలంటూ హడావుడి చేసి భారీగా డబ్బులు గుంజేవారనే ఆరోపణలు ఉన్నాయి.

రెవెన్యూ విభాగంలో పనిచేసే ఉద్యోగులను అక్రమాలకు పాల్పడుతున్నారని బెదిరించడం, పన్నులు సరిగా వసూలు చేయలేకపోతున్నారని వేధించడం ద్వారా వారి నుంచి నెలవారీ మామూళ్లు గుంజేవారంటారు ఎన్నికలకు ముందు సింహాచలంను వేరే జిల్లాకు బదిలీ చేయగా, కొత్త ప్రభుత్వం ఏర్పాటుకాగానే తిరిగి జీవీఎంసీకి రావడానికి ప్రయత్నాలు మొదలెట్టారు. కూటమికి చెందిన నగర ప్రజా ప్రతినిధులను కలిసి పైరవీలు ప్రారంభించారు. వారిని ప్రసన్నం చేసుకునేందుకు బహుమతులు ఇవ్వజూపారనే ప్రచారం జరిగింది. కానీ కూటమి నేతలు పలువురు సింహాచలానికి జీవీఎంసీలో పోస్టింగ్ ఇప్పించేందుకు విముఖత వ్యక్తం చేశారు. అయినప్పటికీ పట్టువదలని విక్రమార్కుడిలా కూటమిలో ఒక సీనియర్ ప్రజా ప్రతినిధిని కలిసి వారి కుటుంబ సభ్యులకు భారీ మొత్తంలో ముడుపులు ఇచ్చి జోన్-2 కమిషనర్‌గా పోస్టింగ్ దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. సింహాచలం అక్రమాస్తులపై అతని వద్ద పనిచేస్తూ వేధింపులకు గురైన సిబ్బందే ఏసీబీకి సమాచారం ఇచ్చి ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఐపీఎల్‌లో మనోళ్లు ఇద్దరు

... 5వ పేజీ తరువాయి

అచ్యుతాపురం మండలం దోసూరు గ్రామానికి చెందిన పైలా అవినాశ్. అతడిని పంజాబ్ జట్టు రూ.30 లక్షలకు పాడుకుంది. దోసూరుకు చెందిన పైలా సత్యారావు, నాగమణి దంపతులకు ఇద్దరు (చరణ్‌తేజ్, అవినాశ్) కుమారులు. సత్యారావు తనకున్న ఒకటిన్నర ఎకరా భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే ఆదాయం అరకొరగా వుండడంతో కొంతకాలం పాన్‌షాపు నడిపారు. అవినాశ్‌కు నాలుగేళ్ల వయసున్నప్పుడు చదువుల నిమిత్తం 2004లో గాజువాకకు మకాం మార్చారు.

సత్యారావు అబుదబీ వెళ్లి కొంతకాలం పనిచేసి వచ్చారు. అక్కడ సంపాదించిన డబ్బుతో పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. పిల్లలిద్దరికీ క్రికెట్ అంటే ప్రాణం. పెద్ద కుమారుడు చరణ్‌తేజ్ బీటెక్ చదువుకున్నాడు. అండర్-16 ఏపీ జట్టుకు మూడుసార్లు ఎంపిక అయినప్పటికీ ఆడే అవకాశం రాకపోవడంతో విసిగిపోయి చదువుపై దృష్టిసారించాడు. ప్రస్తుతం లండన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కుమారుడు అవినాశ్ ఎంబీఏ పూర్తి చేసి, క్రికెట్‌లోనే సత్తా చాటాలని భావించాడు. 2021లో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) టీమ్‌కు ఎంపికై బెజవాడ టీమ్ తరపున ఆడాడు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా ఎంపికయ్యాడు. అతని ప్రతిభను గుర్తించిన కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ యాజమాన్యం ఐపీఎల్-2025 వేలంపాటలో రూ.30 లక్షలకు పాడుకున్నది.

కేన్సర్‌ను ముందే గుర్తించేలా..

... 5వ పేజీ తరువాయి

ఓపీని ఏర్పాటుచేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వారికి పరీక్షలు నిర్వహించి కేన్సర్‌ను నిర్ధారించడంతోపాటు అవసరమైన చికిత్స అందిస్తారు. ప్రస్తుతం సీఎస్ఆర్ బ్లాక్‌లో ఓపీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

18 ఏళ్లు నిండిన వారందరికీ...

స్క్రీనింగ్‌లో భాగంగా 18 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులకు నోటి కేన్సర్‌కు సంబంధించి, మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ఒక్కో వ్యక్తికి అర్ధ గంట సమయాన్ని కేటాయించేలా షెడ్యూల్ ఇచ్చారు. రోజుకు ఐదు ఇళ్లకు మాత్రమే వెళ్లాలని నిర్దేశించారు. దీనివల్ల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు వీలుంటుంది. ఈ సర్వేను తొమ్మిది నెలల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించిందని, అందుకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. సర్వేకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించి పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు. కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే నియంత్రించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు.

రుషికొండలో అర్బన్ హాబిటేట్ సెంటర్

... 5వ పేజీ తరువాయి

విస్తీర్ణంలో బిల్టప్ ఏరియా వస్తుంది. ప్రతి సంస్థ సమావేశాలు నిర్వహించుకునేలా 45 మంది పట్టేలా కాన్ఫరెన్స్ హాళ్లు, 25 మంది పట్టేలా క్యాబిన్ రూమ్‌లు, 85 మందికి సరిపడా మీటింగ్ హాళ్లు, వేయి మంది కూర్చునేలా ఆడిటోరియం, 120 మందితో సెమినార్ హాళ్లు, 2,700 మంది తిరుగాడేలా మల్టీపర్పస్ ట్రేడ్/ఈవెంట్ హాల్ నిర్మించనున్నారు. ఇండోర్ యాంఫీ థియేటర్, 400 మంది పట్టేలా కేఫ్‌టేరియా, 100 మందికి సరిపడా బిజినెస్ లాంజ్, 600 మంది సౌకర్యంగా కూర్చునే ఫైన్ డైన్ రెస్టారెంట్లు ఉంటాయి. 60 రూములు కలిగిన హోటల్, 250 మందికి సరిపడా ఈవెంట్ లాన్, 3,716. చ.మీ. విస్తీర్ణంలో సూపర్ మార్కెట్, 929 చ.మీ. విస్తీర్ణంలో మెడికల్ సెంటర్, మరో 250 మందికి ఉపయోగపడేలా స్పోర్ట్స్ సెంటర్ వస్తాయి. దీనికి ఫీజుబులిటీ రిపోర్ట్, మార్కెట్ అంచనాలు రూపొందిస్తున్నారు.

అక్కడే ఎందుకు?

విశాఖలో ఐటీ పరిశ్రమ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. అదానీ డేటా సెంటర్ ఆ ప్రాంతంలోనే ఏర్పాటు కానుంది. పనోరమ హిల్స్‌తో పాటు అనేక గేటెడ్ కమ్యూనిటీలు వస్తున్నాయి. దగ్గరలోనే ఐటీ పార్కులు ఉన్నాయి. నగరం అటు వైపే ఎక్కువ అభివృద్ధి చెందుతోంది.

మద్యం దుకాణదారుల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

వేళలు పాటించేలా చూడాల్సిన బాధ్యత ఎక్సైజ్, పోలీస్ శాఖలపై ఉంది. కానీ ఎందుచేతనో అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం దుకాణాల్లో పది గంటల తరువాత అమ్మకాలు జరుపుతుంటే పోలీసులు ఆ విషయాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులకు చేరవేయాల్సి ఉన్నప్పటికీ ఆ పనిచేయడం లేదంటున్నారు. మద్యం వ్యాపారుల నుంచి మామూళ్లు అందడం వల్లే మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించినా ఆయా శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న పల్లా శ్రీనివాసరావు

ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన 'పల్లా'

అగనంపూడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా బస్సు సౌకర్యం కల్పించినట్టు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. లంకెలపాలెం నుంచి అగనంపూడి వేపచెట్టు జంక్షన్, ఉక్కు టౌన్‌షిప్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును మంగళవారం ఆయన 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ప్రయాణికులు, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ మార్గంలో బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు.కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు, డిపో మేనేజర్ చటర్జీ,స్థానిక నాయకులు సత్యారావు,సింహాచలం, ఎం.వెంకటరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే విజయవాడ-విశాఖ మధ్య సూపర్ లగ్జరీ బస్సును కూడా పల్లా ప్రారంభించారు.


సభ్యత్వ నమోదులో గండి బాబ్జీ, తదితరులు

పంచగ్రామాల భూ సమస్యకు త్వరలో పరిష్కారం

టీడీపీ 'పెందుర్తి' ఇన్‌చార్జి గండి బాబ్జీ

పెందుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూ సమస్య పరిష్కారానికి సీఎం చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో ఉన్నారని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు చీర అప్పలరాజు ఆధ్వర్యంలో మంగళవారం 94, 95 వార్డుల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు ఆయన హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం భూ సమస్య పరిష్కారానికి సిద్ధంగా ఉందని, దీంతో పంచగ్రామాల ప్రజల వెతలు తీరుతాయన్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా కార్యకర్తలకు భరోసా లభిస్తోందని పేర్కొన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు చేయడమే తమ లక్ష్యమని ఆయనన్నారు. కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీయేనన్నారు. ముందుగా టీడీపీ నాయకులు గండి బాబ్జీని దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పి.అప్పలనాయుడు, పి.శ్రీనివాసరావు, ఆర్.శ్రీను, జి.త్రినాథ్, దొరబాబు, మామిడి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయంలో చోరీ

మల్కాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం గ్రామ దేవత మరిడిమాంబ ఆలయంలో అమ్మవారి మెడలో బంగారు పుస్తెలతాడును ఓ వ్యక్తి చోరీ చేసిన సంఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఆలయంలోకి భక్తుడిలా ప్రవేశించిన వ్యక్తి గర్భగుడిలోకి వెళ్లి అమ్మవారి మెడలో ఉన్న పుస్తెలతాడును తస్కరించి అక్కడ నుంచి జారుకున్నాడు. అయితే ఈ దొంగతనం దృశ్యం సీసీ కెమెరాలో రికార్డు కావడంతో ఆలయ నిర్వాహకులు మల్కాపురం క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు చోరీకి పాల్పడిన వ్యక్తి గురించి గాలిస్తున్నారు.

ఎన్‌ఎంయూ ఆత్మీయ సమావేశం

వేపగుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింహాచలం ఆర్టీసీ డిపో ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో కార్తీక వన ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం సింహాచలం సమీపంలోని దబ్బందలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాము నిరంతరం పోరాడుతునే ఉన్నామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను అక్రమ చార్జిషీట్, సస్పెన్షన్లతో అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎన్‌ఎంయూలో చేరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నీలకంఠం, రామకృష్ణ, శివాజీ, డీకే రాజు, జేఎస్‌ఎన్ రాజు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 56, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 35, క్యాబేజీ 36, క్యారెట్ 76, దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది)50, మునక్కాడలు (కిలో) 80, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 54, పొటల్స్ 48, కీరదోస 28, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 34, కంద 60, దేముడుచిక్కుడు 60, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికమ్ ... కర్రపెండలం 45, మామిడి అల్లం 60, మామిడికాయలు 100, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230


పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు


ఉక్కు టౌన్‌షిప్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చీఫ్ విజిలెన్స్ అధికారి కరుణరాజు, తదితరులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

పలుచోట్ల అంబేడ్కర్‌కు నివాళులు

మల్కాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 61వ వార్డు ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం, లౌకిక రాజ్యం వంటి ప్రత్యేకతలతో మన రాజ్యాంగం విరాజిల్లుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, పీవీ సురేశ్, గుండపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సెయింట్ ఆన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగహన పెంచుకోవాలన్నారు. సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయాదేవి. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కేస్లీన్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.విజయ్‌బాబు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు.

పెందుర్తి: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, కూటమి నాయకులు కరక దేవుడు, పిళ్లా జగన్మోహన్ పాత్రుడు, గొర్లె అప్పారావు, దళిత నేత దుంబారి రామారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ రాష్ట్ర యువజన కార్యదర్శి షేక్ షఫీవుల్లా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో, స్థానిక గ్రంథాలయంలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు. పాఠకులు అంబేడ్కర్ చిత్రపటానిక పూలమాల వేసి రాజ్యాంగ పీఠిక చదివి ప్రమాణం చేశారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, గ్రంథాలయాధికారి సూర్యకళ పాల్గొన్నారు.

పెదగంట్యాడ: ప్రపంచంలోని అన్ని దేశాల రాజ్యాంగాల కంటే భారత రాజ్యాంగం ఉన్నతమైనదని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ నిర్వహణాధికారి పీవీ రమణ అన్నారు. గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగానికి కాలానుగుణంగా సవరణలు జరుగుతున్నా.. దాని మౌలిక సూత్రాలు అలాగే అమలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

అగనంపూడి: ఇక్కడి సత్రం జంక్షన్‌లో గల మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని పాలకులు, ప్రజలు నిజాయితీ అమలు చేసినప్పుడే అంబేడ్కర్‌కు ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సింగిడి సింహాచలం, మోహన్, నాగబాబు, నాగేశ్వరరావు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ జె.సుధాకర్ పుష్పమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులందరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, బి.సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: మన రాజ్యాంగం ప్రపంచంలోనే ఎంతో గొప్పదని స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఎస్.కరుణరాజు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం కరుణరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఉద్యోగి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొండ తౌడన్న, బయ్యే మల్లయ్య. జీఎంలు మధుసూదనరావు, రాగూర్, డి.విజయ్‌కుమార్, భాను, డీజీఎం రాధిక, మనోజ్‌ఓరాన్, బాబునాయక్, నాయకులు బి.అప్పారావు, ఎల్‌వీ. రమణరావు, ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న పల్లా శ్రీనివాసరావు

ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన 'పల్లా'

అగనంపూడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా బస్సు సౌకర్యం కల్పించినట్టు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. లంకెలపాలెం నుంచి అగనంపూడి వేపచెట్టు జంక్షన్, ఉక్కు టౌన్‌షిప్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును మంగళవారం ఆయన 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ప్రయాణికులు, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ మార్గంలో బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు, డిపో మేనేజర్ చటర్జీ, స్థానిక నాయకులు సత్యారావు, సింహాచలం, ఎం.వెంకటరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే విజయవాడ-విశాఖ మధ్య సూపర్ లగ్జరీ బస్సును కూడా పల్లా ప్రారంభించారు.

క్యాన్సర్ బాధితురాలికి సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

జీవీఎంసీ 69వ వార్డు పరిధి అయ్యప్పనగర్‌లో క్యాన్సర్ వ్యాధికి గురైన ఎల్.లక్ష్మి చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.4,39,000ను చెక్కు రూపంలో మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బాధితురాలి భర్తకు అందజేశారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మి భర్త సత్యనారాయణ, టీడీపీ వార్డు అధ్యక్షుడు అలమండ రాజు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అండగా ప్రభుత్వాలు: ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులకు రుణాలు ఇచ్చి అండగా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి ప్రాంగణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పీఎం స్వానిధి-బి, స్వాభిమాన్-బి పక్వాడ్ అనే కార్యక్రమాన్ని మంగళవారం జోన్-5 యూసీడీ విభాగం అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వీధి వ్యాపారులకు రుణాల మంజూరు, వారి కుటుంబ సభ్యుల వివరాల సేకరణ ద్వారా సామాజిక భద్రత ఉంటుందన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి మాతృ వందన, ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన, ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు, తదితర పథకాల గురించి అవగహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్సీ రాము, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు గ్రీష్మిత

గాజువాక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 72వ వార్డు పరిధి వుడా కాలనీ ప్రాంతానికి చెందిన బాక్సర్ గ్రీష్మిత జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల మచిలీపట్నంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో అండర్-17 విభాగంలో గ్రీష్మిత పాల్గొని బంగారు పతకాన్ని సాధించడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబరు నెలలో ఢిల్లీలో జరగనున్న ఆ పోటీల్లో ఆమె పాల్గొననున్నది. ఈ సందర్భంగా మంగళవారం ఇక్కడి బీజేపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు గ్రీష్మితను అభినందించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ద్వారపూడి సూర్యనారాయణరెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కార్యాలయం పక్కన గల పార్కింగ్ ప్రదేశంలో నిలిపివేసిన క్లాప్ వాహనాలు, ఆందోళన చేస్తున్న వాహనాల డ్రైవర్లు, లోడర్లు

క్లాప్ వాహన డ్రైవర్ల ఆకస్మిక సమ్మె

విధులు బహిష్కరించి తమ సమస్యలను పరిష్కరించాలని ఆందోళన

గాజువాక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ పరిధిలో తడి-పొడి చెత్తను సేకరించే క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్లు విధులు బహిష్కరించి మంగళవారం ఆకస్మిక సమ్మెకు దిగారు. వీరంతా మంగళవారం ఉదయం క్లాప్ వాహనాలను జోనల్ కార్యాలయం పక్కన గల పార్కింగ్ ప్రదేశంలో నిలిపివేసి ఆందోళన చేపట్టారు. తమకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్ కోసం తమ జీతాల నుంచి కట్ చేస్తున్నా ఆయా సంస్థలకు చెల్లించడం లేదని, తమకు ఏమైనా ప్రమాదాలు జరిగితే సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని, తమ సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళనను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ఎం.రాంబాబు, నక్కా నాగరాజు, గణేశ్, అనీల్, సురేశ్, రాజు, లక్ష్మీలతో పాటు అధిక సంఖ్యలో డ్రైవర్లు, కార్మికులు పాల్గొన్నారు.

బంగారమ్మ ఆలయ స్థలాన్ని కాపాడాలని ఆందోళన

అగనంపూడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసలోని బంగారమ్మ అమ్మవారి ఆలయ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని స్థానికులు మంగళవారం ఇక్కడి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. స్థానికంగా ఉంటున్న ఇద్దరు వ్యక్తులు ఆలయానికి చెందిన స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఈ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో స్థానికులు వసంతరావు, రామకృష్ణ, మణిబాబు, రాజుమాధవ్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.







గ్రీన్‌సిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు, పక్కన దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

స్టీల్‌ప్లాంట్ ఆలయంలో సహస్ర దీపాలంకరణ

శ్రీవారి ఆలయంలో వైభవంగా లక్ష దీపోత్సవం

కూర్మన్నపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏడుకొండలవాడా, వేంకటేశా.. ఆపద మొక్కులవాడా.. అనాథ రక్షకా గోవిందా.. గోవింద నామస్మరణతో మంగళవారం రాత్రి 88వ వార్డు పరిధిలోని గ్రీన్‌సిటీ ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. కార్తీక మాసం బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఇక్కడి శ్రీలక్ష్మి ఆండాళ్ సమేత వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత శ్రీవారిని బంగారు, వెండి ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి కల్పవృక్ష వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగించారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావు, పద్మ, రాజ్యలక్ష్మి, చిన్న సురేశ్, రమేశ్, శాంతి, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంటులో గల వేంకటేశ్వరాలయంలో వేకువజామున స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూలంగి సేవ, నక్షత్ర సేవ, కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు.

40వ వార్డులో జోనల్ కమిషనర్ రాము పర్యటన

సింధియా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో మంగళవారం జోనల్ కమిషనర్ రాము పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఏకేసీ కాలనీ ప్రధాన రహదారిలో మరో చిన్నపాటి రోడ్డును ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ సమస్యలను తొలగించాలని స్థానికులు జెడ్సీని కోరారు. ఆయా సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, హెల్త్ ఆఫీసర్ సునీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌కు జాతీయ స్థాయి అవార్డు

వేపగుంట నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రచురించే నెలవారీ వార్తా లేఖ విజనరీ ఇన్సైట్స్‌లో కంటి వైద్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రయోజనాలు, నూతన పోకడలపై ప్రచురితమైన కథనానికి జాతీయ స్థాయిలో ద్వితీయ అవార్డుకు ఆస్పత్రి ఎంపికైనట్టు పీఆర్ఎస్ఐ కార్యదర్శి డాక్టర్ ఆజిత్ పాఠక్, పీఎల్‌కే మూర్తి ఒక ప్రకటనలో ఫౌండేషన్ ప్రతినిధులకు తెలియజేశారు. ఈ అవార్డును డిసెంబరు 20 నుంచి 22 వరకు రాయచూర్‌లో జరిగే సమావేశాల్లో అందించనున్నారు.

మహిళలపై అరాచకాలను అరికట్టాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి

మల్కాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) మహిళలపై రోజురోజుకు అరాచకాలు పెరిగిపోతున్నాయని, వీటిని ప్రభుత్వాలు అరికట్టలేకపోతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి వై.సత్యవతి విమర్శించారు. ఇక్కడి సీఐటీయు కార్యాలయంలో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలంటూ మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో లా విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనకు ప్రభుత్వాలే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.విమల, నాయకులు వై.కల్యాణి, బి.రాజేశ్వరి, పి.వరలక్ష్మి, అన్నపూర్ణ, బి.లక్ష్మి, నిర్మల, విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

పెదగంట్యాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక ఏకాదశి సందర్భంగా నెల్లిముక్కులోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో మంగళవారం ఆలయ నిర్వాహక కమిటీ, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు ముద్దుర్తి శ్రీరామమూర్తి, కణితి అప్పలరాజు, గాజువాక వర్తక సంఘం అధ్యక్షుడు తిప్పల నితీశ్‌రెడ్డి, పీటీఆర్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, స్థానిక నాయకులు పి.కుంచారావు, ఎం.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు.

అభివృద్ధి పనులు అడ్డుకోవద్దని పంచకర్ల సూచన

వేపగుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 93వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను సింహాచల దేవస్థానం అధికారులు అడ్డుకోవడంపై ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు వారిని పిలిపించి మాట్లాడారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులకు అడ్డు చెప్పవద్దని సూచించారు. అభివృద్ధి విషయంలో సీఎం చంద్రబాబు ఎంతో ముందు చూపుతో వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా, ఏఈవో రాజ, సూపరింటెండెంట్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలి

గోపాలపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడి పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు కోరారు. స్థానిక నాయుడు గ్రాండ్ హోటల్‌లో మంగళవారం గోపాలపట్నం వర్తక సంఘం సభ్యులకు ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలని కోరుతూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులకు బదులుగా నార, వస్త్ర, కాగితపు సంచులను వాడాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. స్వచ్ఛ నగరాల్లో విశాఖ నగరాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బీవీ రమణ, పలువురు అధికారులు, వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్ శ్రావణి తదితరులు

అక్కయ్యపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్, చాకలి వీధిలో సుమారు రూ.50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. చాకలివీధిలో దోబీఖానా, మేడపై మొదటి అంతస్తు నిర్మాణం, మ్యాన్‌హోల్స్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్పొరేటర్ ముక్కా శ్రావణి, నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్, జనసేన అధ్యక్షుడు బండి కన్నా, బీజేపీ సీతమ్మధార మండల అధ్యక్షుడు నాగడమూడి నానాజీ, ఏఈ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య ప్రణాళిక అమలుపై ఆరా



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీఈవో సోమేశ్వరరావు, చిత్రంలో ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాఠాలు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి (డీడీఈవో) సోమేశ్వరరావు పదో తరగతి విద్యార్థులకు సూచించారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠ్య ప్రణాళిక అమలవుతున్నదీ, లేనిదీ విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. హిందీ రాయడం, చదవడం అందరికీ వచ్చా? అని ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీ నరస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఐటీఐ అభ్యర్థులకు జాబ్‌మేళా

కంచరపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ ప్రాంగణంలో బుధవారం (నేడు) నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో అన్ని ట్రేడ్లు ఉత్తీర్ణులైన వారు, ఇంటర్, డిప్లొమా పాసైన వారు దీనికి హాజరుకావచ్చు. చెన్నైకు చెందిన ప్రముఖ కంపెనీ ఇంఫాక్ట్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ ప్రతినిధులు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అర్హులు అన్ని ధ్రువపత్రాలు, బయోడేటాతో బుధవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని శ్రీకాంత్ సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.13,900 వేతనం, సౌకర్యాలు కల్పిస్తారన్నారు.

29న ఉపాధి కార్యాలయం సమీపంలో..

కంచరపాలెం ఉపాధి కార్యాలయం సమీపంలో గల నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున జాబ్‌మేళా చేపట్టనున్నట్టు ప్రాంతీయ ఉప ఉపాధికల్పనాధికారి శ్యాం సుందర్ నిట్టల తెలియజేశారు. ఈ మేళాలో పలు ప్రముఖ ప్రయివేటు కంపెనీలు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. మెషిన్ ఆపరేటర్, షిఫ్ట్ సూపర్ వైజర్, సేల్స్ ఇంజినీర్స్, సర్వీస్ ఇంజినీర్స్, ఎస్‌బీఐ, డిమార్ట్‌లో సేల్స్ మెషిన్ ఆపరేటర్ తదితర ఉద్యోగాలకు ఎంపికలు జరుగుతాయన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైన యువత పాల్గొనవచ్చు. ఆసక్తి గలవారు ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ నెల 29న ఉదయం 9 గంటలకు ధ్రువపత్రాలతో మేళాలో పాల్గొనవచ్చని శ్యాంసుందర్ సూచించారు.

7న సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణం



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి

డాబాగార్డెన్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న సుబ్రహ్మణ్యషష్ఠి సందర్భంగా వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ఘనంగా కల్యాణం నిర్వహించనున్నట్లు డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయం ఈవో జీవీ రమాభాయి తెలిపారు. 6న సాయంత్రం ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉత్సవమూర్తులతో తిరువీధి మహోత్సవం నిర్వహిస్తామన్నారు. పాల్గొనదలచినవారు నేరుగా ఆలయంలో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

మహిళా హోంగార్డుకు ఉద్యోగ విరమణ సన్మానం



కృష్ణను సన్మానిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

సీతంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్‌లో మహిళ హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ కృష్ణ ఉద్యోగ విరమణ పొందడంతో ఆమెను సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్‌ఐలు ధర్మేంద్ర, శ్రీను, ఏఎస్‌ఐ రత్నం, సిబ్బంది సన్మానించారు. ఆమె అందించిన సేవలను కొనియాడారు.

దేశానికి అంబేడ్కర్ సేవలు మహోన్నతం

» ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం » రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిన » కార్యాలయాల్లో ఉత్సవాలు



రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామంటూ ఈపీడీసీఎల్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల ప్రతిజ్ఞ



ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్



ధర్మానగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కె.కె.రాజు

డాబాగార్డెన్స్/అల్లిపురం/అక్కయ్యపాలెం/కంచరపాలెం/మురళీనగర్/సీతమ్మధార, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల్లోని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ దూరదృష్టిని, రాజ్యాంగ రచయితగా దేశానికి ఆయన అందించిన మహోన్నత సేవలను పలువురు కొనియాడారు. ఆయన విగ్రహాల వద్ద వేడుకలు జరుపుకొని, చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. సామాజిక న్యాయం, ఆర్థిక, రాజకీయ సమానత్వం పొందుతున్నామంటే రాజ్యాంగం ఫలితమేనని పలువురు పేర్కొన్నారు. రాజ్యాంగమే ఈ దేశానికి జీవనాడి అని హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ అన్నారు. విదసం కన్వీనర్ బూసి వెంకటరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సరస్వతీ పార్కు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు దిశా నిర్దేశం చేస్తున్నది భారత రాజ్యాంగమేనని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. వైసీపీ జిల్లా ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు గణేష్‌కుమార్, ధర్మశ్రీ, ఎమ్మెల్సీ కల్యాణి, డిప్యూటీ మేయర్ సతీష్, కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయం (ఏపీఈపీడీసీఎల్)లో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తమ సిబ్బందితో భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. సంస్థ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, ఎన్‌వీ రమణమూర్తి, సీజీఎంలు డి.సుమన్ కల్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్, టీవీఎస్ఎన్ మూర్తి, బి.అశోక్‌కుమార్, జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం ప్రాముఖ్యతను ఆయన వివరించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ కందుల నాగరాజు పిలుపునిచ్చారు. మహిళా కో-ఆర్డినేటర్ అమరాపు దుర్గ, నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు. మాధవధార కళింగనగర్ వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మాట్లాడారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి బాలామణి, ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీ నరస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. :రాజ్యాంగాన్ని గౌరవించాలని ఉత్తర వైసీపీ నాయకుడు కెకె.రాజు పేర్కొన్నారు. ధర్మానగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద జనసేన నాయకుల నివాళి

బెస్ట్ అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా చైతన్య



చైతన్యను అభినందిస్తున్న మధుకుమార్, ఇతర ప్రముఖులు

సీతమ్మధార, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉప లెఫ్టినెంట్ టి.ఎన్. చైతన్య ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లోని నావల్ వింగ్ సీనియర్ విభాగానికి బెస్ట్ అసోసియేట్ ఆఫీసర్ (ఎఎస్‌ఒ)గా గుర్తింపు పొందారు. నవంబరు 24న హైదరాబాద్‌లో జరిగిన 76వ ఎన్‌సీసీ రైజింగ్ డే వేడుకల సందర్భంగా రెండు రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నుంచి ఆయన ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ చైతన్యను అభినందించారు. ఉప లెఫ్టినెంట్ టిఎన్ చైతన్య తన విజయంపై ప్రిన్సిపాల్ డాక్టర్ జిఎస్‌కె చక్రవర్తి, యూజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, పీజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌హెచ్ శ్రీకాంత్, మేజర్ బ్రహ్మానందరెడ్డి, అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఘనంగా మృత్యుంజయ హోమం



హోమం జరిపిస్తున్న అర్చకుడు శర్మ, హాజరైన ప్రముఖులు

అల్లిపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం దక్షిణ నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వెంకటేశ్వర మెట్టలోని బల్లిగిరి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. డీబీకే డాల్ఫిన్స్ నోస్, రైల్వే క్వార్టర్స్‌లో లక్ష్మీ వరసిద్ధి వినాయక, భవాని శంకర స్వామి దేవాలయం వద్ద మహామృత్యుంజయ హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు దార్లపూడి శ్రీనివాసశర్మ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.వి. వసంతరావు, దాసన సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జాయ్ జమీమా కేసును సీబీఐకి అప్పగించాలి'



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

డాబాగార్డెన్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హనీట్రాప్ కేసులో రిమాండ్‌లో ఉన్న జాయ్ జమీమా నిందితురాలు కాదు.. బాధితురాలని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాయ్ జమీమాను అరెస్టు చేసిన తీరు, నమోదైన సెక్షన్లలో కుట్రకోణం కనిపిస్తోందని ఆరోపించారు. విశాఖపట్నం కేంద్ర కారాగారంలో ఆమెను కలిసినప్పుడు ఈ విషయాలు తెలుసుకున్నామని వెల్లడించారు. హనీట్రాప్‌తో చాలా మందిని ఆమె మోసం చేసి దోచుకుందంటూ సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను ఖండిస్తున్నట్టు తెలిపారు. అమాయకురాలి వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ చూపించారని విచారం వ్యక్తం చేశారు. అమ్మాయి వెనుక ముఠా ఉందని పోలీసులు చెబుతున్నా, ఇప్పటి వరకు ఎంత మందిని అరెస్టు చేశారో చెప్పలేదన్నారు. ఎన్ఆర్ఐ మనోహర్‌ని పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నానని, రక్షణ కల్పించాలని కోరిందని వెల్లడించారు. మూడుసార్లు కస్టడీకి తీసుకున్న పోలీసులు ఆమె నుంచి రాబట్టిన సమాచారం ఏమిటో చెప్పాలని కోరారు. ఆమెను కించపరుస్తూ విశాఖ నగర పోలీస్ కమిషనర్ మాట్లాడటంపై హర్షకుమార్ అసహనం వ్యక్తం చేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని ఆయనతో పాటు విశాంత్ర సీఐ సోల్మన్‌రాజు డిమాండ్ చేశారు.

7న మెగా పేరెంట్-టీచర్ సమావేశాలు: కలెక్టర్

మహారాణిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పిల్లల బంగారు భవిష్యత్ కోసం 'బడి వైపు ఒక అడుగు' అనే నినాదంతో జిల్లాలో డిసెంబరు 7న తలపెట్టిన మెగా పేరెంట్, టీచర్ సమావేశాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు, తల్లిదండ్రులకు, సమాజానికి మధ్య పటిష్ఠమైన, సుహృద్భావ వాతావరణం ఏర్పరచటానికి ఇలాంటి సమావేశాలు చాలా అవసరమని పేర్కొన్నారు. విశాఖ జిల్లాలోని 11 మండలాల పరిధిలో గల 595 ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు సహకరిస్తే ఆశాజనక ఫలితాలు వస్తాయన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

మహారాణిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్ వద్ద సముద్రంలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మంగళవారం ఉదయం ఫిషింగ్ హార్బరులోని పదో నెంబరు జెట్టీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి కుడి కాలుకు బలమైన గ్రానైట్ రాయి కట్టి ఉన్న మృతదేహం సముద్రంలో తేలుతూ కనిపించటంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి కేజీహెచ్ శవాగారానికి తరలించి కేసు నమోదు చేశారు. కాలుకు బలమైన రాయి కట్టి ఉండటంతో ఎవరో కావాలనే హత్య చేసి సముద్రంలో పడవేశారని భావిస్తున్నారు. అతడు ఎవరన్నది గుర్తించేందుకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఆవుల చోరీపై పోలీసులకు ఫిర్యాదు

సీతమ్మధార, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండు జెర్సీ ఆవులను చోరీ చేశారంటూ ద్వారకా పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుడు రాము తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతమ్మధార ఏఎస్ఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎ.రాము రెండు జెర్సీ ఆవులను ఎనిమిదేళ్లుగా పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి ఆవరణలో కట్టి ఉంచిన ఆవులు ఆదివారం ఉదయం నిద్రలేచి చూసేసరికి కనిపించలేదు. రాము చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. అనంతరం మంగళవారం బాధితుడు రాము ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైళ్లు రద్దు...రీ షెడ్యూల్


విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన రద్దీ, ఇతర సాంకేతిక కారణాల వల్ల రాయగడ-విజయనగరం మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్టు అధికార వర్గాలు మంగళవారం తెలిపాయి. వారానికి రెండుసార్లు నడిచే విశాఖపట్నం-కోరాపుట్ (నంబర్ 18512) రైలు ఈ నెల 29 నుంచి డిసెంబరు 2 వరకూ రద్దయింది. అలాగే అటు నుంచి వచ్చే 18511 నంబర్ రైలు నవంబరు 30 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు రద్దయింది. విశాఖపట్నం నుంచి కోరాపుట్ వెళ్లే పాసింజర్ రైలు (08546)ను 29వ తేదీ నుంచి డిసెంబరు 4 వరకు రద్దు చేశారు. అటు నుంచి వచ్చే రైలు (08545) నవంబరు 29 నుంచి డిసెంబరు 5 వరకూ రద్దయింది. గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) 28వ తేదీ నుంచి డిసెంబరు 3 వరకు రద్దయింది. అటు నుంచి వచ్చే 17244 నంబరు రైలు 29 నుంచి డిసెంబరు 4 వరకు రద్దు చేశారు.

రీషెడ్యూల్ చేసిన రైళ్లు

నాందేడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (20810 నంబరు) నవంబరు 30, డిసెంబరు 2, 3 తేదీల్లో సాయంత్రం 4.30 గంటలకు బదులు నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయలుదేరుతుంది. దుర్గ్-విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (20829) 29 నుంచి డిసెంబరు 4 వరకు రెండు గంటలు ఆలస్యంగా ఉదయం 7.45 గంటలకు బయలుదేరుతుంది. కోయంబత్తూరు-ధన్‌బాద్ స్పెషల్ రైలు (06063) 29న రెండు గంటలు ఆలస్యంగా 1.50 గంటలకు బయలుదేరుతుంది. ఈరోడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (08312) 29న రెండు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 3.45 గంటలకు బయలుదేరుతుంది. బరంపూర్-సూరత్ స్పెషల్ (09060) రైలు 29న ఐదు గంటలు ఆలస్యంగా ఉదయం 9.30 గంటలకు బయలుదేరుతుంది. కోయంబత్తూర్-బరౌని రైలు (06059) డిసెంబరు 3న రెండు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 1.50 గంటలకు బయలుదేరుతుంది.

విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్ సమతా ఎక్స్‌ప్రెస్ (12807) నవంబరు 30, డిసెంబరు 1, 3, 4 తేదీల్లో నాలుగు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరుతుంది. అటు నుంచి వచ్చే రైలు (నంబర్ 12808) 28, 29, 30, 2, 3, తేదీల్లో నాలుగు గంటలు ఆలస్యంగా ఉదయం 11 గంటలకు బయలుదేరుతుంది. విశాఖపట్నం-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (నంబర్ 22847) వయా రాయగడ డిసెంబరు 1న నాలుగు గంటలు ఆలస్యంగా ఉదయం 8.20 గంటలకు బయలుదేరుతుంది. విశాఖపట్నం-దుర్గ్ వందేభారత్ రైలు (20830) 29 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు 1.20 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.50 గంటలకు బయలుదేరుతుంది.

గండి బాబ్జీకి నేతల అభినందన



బాబ్జీని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కంచరపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ రాష్ట్ర సహకార నూనెగింజల అభివృద్ధి సంస్థ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో జీవీఎంసీ 48వ వార్డు టీడీపీ నాయకులు ఆయనను కలిసి అభినందించారు. సీనియర్ నాయకుడు గొర్లె అప్పారావు, నాగమణిల ఆధ్వర్యంలో పలువురు బాబ్జీని కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యాడ అప్పారావు, కడుముల దామోదరం, జి.జయ, పైలా శంకర్, గొల్లపల్లి వెంకటరావు, గోపి, సరోజిని, మహేష్ తదితరులు ఉన్నారు.

కొండవాలు సమస్యలపై కమిషనర్‌కు వినతి

కంచరపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వవార్డు కొండవాలు గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోరుతూ ఆ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత మంగళవారం కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు, రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, కాలువల నిర్మాణానికి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గంకల అప్పారావు పాల్గొన్నారు.

అవినీతి అనకొండ

... 5వ పేజీ తరువాయి

పెద్దఎత్తున చందాలు వసూలు చేశారని ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నింటిపై పత్రికల్లో కథనాలు రావడంతో ఆయన్ను విజయనగరం జిల్లా పార్వతీపురం మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో తనకున్న పలుకుబడిని ఉపయోగించుకుని ఆయన కొద్దిరోజులకే తిరిగి జీవీఎంసీకి బదిలీ చేయించుకుని జోన్-6 (గాజువాక) కమిషనర్‌గా పోస్టింగ్ తెచ్చుకున్నారు. అక్కడ పని చేస్తున్నప్పుడు పరిశ్రమలు సామాజిక బాధ్యత కింద గాజువాక ప్రాంతంలో ఖర్చు పెట్టాల్సిన నిధులను జీవీఎంసీ ఖాతాకు కాకుండా తన వ్యక్తిగత ఖాతాలో డిపాజిట్ చేయించుకోవడం వివాదాస్పదమైంది. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో జీవీఎంసీ ఉన్నతాధికారులు విచారణ జరిపారు. కానీ తనకున్న పలుకుబడిని ఉపయోగించుకుని ఆ వివాదం నుంచి బయటపడ్డారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు నిర్మాణంలో ఉన్న భవనాలు కనిపిస్తే వాటి వద్దకు వెళ్లి ప్లాన్‌ను ఉల్లంఘించి నిర్మాణం చేస్తున్నారని, వాటిని కూల్చేయాలంటూ హడావుడి చేసి భారీగా డబ్బులు గుంజేవారనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ విభాగంలో పనిచేసే ఉద్యోగులను అక్రమాలకు పాల్పడుతున్నారని బెదిరించడం, పన్నులు సరిగా వసూలు చేయలేకపోతున్నారని వేధించడం ద్వారా వారి నుంచి నెలవారీ మామూళ్లు గుంజేవారంటారు ఎన్నికలకు ముందు సింహాచలంను వేరే జిల్లాకు బదిలీ చేయగా, కొత్త ప్రభుత్వం ఏర్పాటుకాగానే తిరిగి జీవీఎంసీకి రావడానికి ప్రయత్నాలు మొదలెట్టారు. కూటమికి చెందిన నగర ప్రజా ప్రతినిధులను కలిసి పైరవీలు ప్రారంభించారు. వారిని ప్రసన్నం చేసుకునేందుకు బహుమతులు ఇవ్వజూపారనే ప్రచారం జరిగింది. కానీ కూటమి నేతలు పలువురు సింహాచలానికి జీవీఎంసీలో పోస్టింగ్ ఇప్పించేందుకు విముఖత వ్యక్తంచేశారు. అయినప్పటికీ పట్టువదలని విక్రమార్కుడిలా కూటమిలో ఒక సీనియర్ ప్రజా ప్రతినిధిని కలిసి వారి కుటుంబ సభ్యులకు భారీ మొత్తంలో ముడుపులు ఇచ్చి జోన్-2 కమిషనర్‌గా పోస్టింగ్ దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. సింహాచలం అక్రమాస్తులపై అతని వద్ద పనిచేస్తూ వేధింపులకు గురైన సిబ్బందే ఏసీబీకి సమాచారం ఇచ్చి ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రుషికొండలో అర్బన్ హాబిటేట్ సెంటర్

... 5వ పేజీ తరువాయి

విస్తీర్ణంలో బిల్టప్ ఏరియా వస్తుంది. ప్రతి సంస్థ సమావేశాలు నిర్వహించుకునేలా 45 మంది పట్టేలా కాన్ఫరెన్స్ హాళ్లు, 25 మంది పట్టేలా క్యాబిన్ రూమ్‌లు, 85 మందికి సరిపడా మీటింగ్ హాళ్లు, వేయి మంది కూర్చునేలా ఆడిటోరియం, 120 మందితో సెమినార్ హాళ్లు, 2,700 మంది తిరుగాడేలా మల్టీపర్పస్ ట్రేడ్/ఈవెంట్ హాల్ నిర్మించనున్నారు. ఇండోర్ యాంఫీ థియేటర్, 400 మంది పట్టేలా కేఫ్‌టేరియా, 100 మందికి సరిపడా బిజినెస్ లాంజ్, 600 మంది సౌకర్యంగా కూర్చునే ఫైన్ డైన్ రెస్టారెంట్లు ఉంటాయి. 60 రూములు కలిగిన హోటల్, 250 మందికి సరిపడా ఈవెంట్ లాన్, 3,716. చ.మీ. విస్తీర్ణంలో సూపర్ మార్కెట్, 929 చ.మీ. విస్తీర్ణంలో మెడికల్ సెంటర్, మరో 250 మందికి ఉపయోగపడేలా స్పోర్ట్స్ సెంటర్ వస్తాయి. దీనికి ఫీజుబులిటీ రిపోర్ట్, మార్కెట్ అంచనాలు రూపొందిస్తున్నారు.

అక్కడే ఎందుకు?

విశాఖలో ఐటీ పరిశ్రమ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. అదానీ డేటా సెంటర్ ఆ ప్రాంతంలోనే ఏర్పాటు కానుంది. పనోరమ హిల్స్‌తో పాటు అనేక గేటెడ్ కమ్యూనిటీలు వస్తున్నాయి. దగ్గరలోనే ఐటీ పార్కులు ఉన్నాయి. నగరం అటు వైపే ఎక్కువ అభివృద్ధి చెందుతోంది.

మద్యం దుకాణదారుల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

వేళలు పాటించేలా చూడాల్సిన బాధ్యత ఎక్సైజ్, పోలీస్ శాఖలపై ఉంది. కానీ ఎందుచేతనో అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం దుకాణాల్లో పది గంటల తరువాత అమ్మకాలు జరుపుతుంటే పోలీసులు ఆ విషయాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులకు చేరవేయాల్సి ఉన్నప్పటికీ ఆ పనిచేయడం లేదంటున్నారు. మద్యం వ్యాపారుల నుంచి మామూళ్లు అందడం వల్లే మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించినా ఆయా శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నారు.

ఐపీఎల్‌లో మనోళ్లు ఇద్దరు

... 5వ పేజీ తరువాయి

అచ్యుతాపురం మండలం దోసూరు గ్రామానికి చెందిన పైలా అవినాశ్. అతడిని పంజాబ్ జట్టు రూ.30 లక్షలకు పాడుకుంది. దోసూరుకు చెందిన పైలా సత్యారావు, నాగమణి దంపతులకు ఇద్దరు (చరణ్‌తేజ్, అవినాశ్) కుమారులు. సత్యారావు తనకున్న ఒకటిన్నర ఎకరా భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే ఆదాయం అరకొరగా వుండడంతో కొంతకాలం పాన్‌షాపు నడిపారు. అవినాశ్‌కు నాలుగేళ్ల వయసున్నప్పుడు చదువుల నిమిత్తం 2004లో గాజువాకకు మకాం మార్చారు. సత్యారావు అబుదబీ వెళ్లి కొంతకాలం పనిచేసి వచ్చారు. అక్కడ సంపాదించిన డబ్బుతో పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. పిల్లలిద్దరికీ క్రికెట్ అంటే ప్రాణం. పెద్ద కుమారుడు చరణ్‌తేజ్ బీటెక్ చదువుకున్నాడు. అండర్-16 ఏపీ జట్టుకు మూడుసార్లు ఎంపిక అయినప్పటికీ ఆడే అవకాశం రాకపోవడంతో విసిగిపోయి చదువుపై దృష్టిసారించాడు. ప్రస్తుతం లండన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కుమారుడు అవినాశ్ ఎంబీఏ పూర్తి చేసి, క్రికెట్‌లోనే సత్తా చాటాలని భావించాడు. 2021లో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) టీమ్‌కు ఎంపికై బెజవాడ టీమ్ తరపున ఆడాడు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా ఎంపికయ్యాడు. అతని ప్రతిభను గుర్తించిన కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ యాజమాన్యం ఐపీఎల్-2025 వేలంపాటలో రూ.30 లక్షలకు పాడుకున్నది.

కేన్సర్‌ను ముందే గుర్తించేలా..

... 5వ పేజీ తరువాయి

ఓపీని ఏర్పాటుచేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వారికి పరీక్షలు నిర్వహించి కేన్సర్‌ను నిర్ధారించడంతోపాటు అవసరమైన చికిత్స అందిస్తారు. ప్రస్తుతం సీఎస్ఆర్ బ్లాక్‌లో ఓపీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

18 ఏళ్లు నిండిన వారందరికీ...

స్క్రీనింగ్‌లో భాగంగా 18 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులకు నోటి కేన్సర్‌కు సంబంధించి, మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ఒక్కో వ్యక్తికి అర్ధ గంట సమయాన్ని కేటాయించేలా షెడ్యూల్ ఇచ్చారు. రోజుకు ఐదు ఇళ్లకు మాత్రమే వెళ్లాలని నిర్దేశించారు. దీనివల్ల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు వీలుంటుంది. ఈ సర్వేను తొమ్మిది నెలల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించిందని, అందుకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. సర్వేకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించి పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు. కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే నియంత్రించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు.

హీమోఫీలియా రోగులకు సరికొత్త వైద్య విధానం



కేజీహెచ్‌లో బాలలతో కేకు కోయిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో హీమో ఫీలియా రోగులకు సరికొత్త చికిత్సా అధ్యయనాన్ని ప్రారంభించారు. మంగళవారం పీడియాట్రిక్ విభాగంలో హీమో ఫీలియా ఇన్‌బీటర్ రోగుల చికిత్సకు ఎమిసిజుమాబ్ అనే నూతన పైలెట్ అధ్యయనాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ప్రారంభించారు. ఇది మోనోక్లోనల్ యాంటీబాడి హీమో ఫీలియా రోగులలో లోపించిన ఫ్యాక్టర్ 8 చర్యలను అనుకరించటం ద్వారా రోగులను కాపాడవచ్చు. గాయం జరిగినప్పుడు అదుపు తప్పిన రక్తస్రావాన్ని ఇది నిరోధిస్తుంది. జీవితంలో అంగవైకల్యం వంటి సమస్యలను నిరోధిస్తుంది. ఎమీసిజుమాబ్ 30 ఎమ్‌జీ మందు రూ.43 వేలు వంతున ఒక రోగికి సంవత్సరానికి రూ. 26 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్ శివానంద్ తెలిపారు. దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఇద్దరు రోగులకు ఉచితంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. చికిత్స ఖర్చుకు వెనుకాడకుండా ప్రభుత్వం పిల్లల భద్రతకు ముందుకు రావటం హర్షణీయమని తెలిపారు. పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ రత్నకుమారి డాక్టర్ రమ్య వైద్యులు పాల్గొన్నారు.


ఆరిలోవ : పెదగదిలిలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి


వెంకోజీపాలెం : అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఏయూ వీసీ, సిబ్బంది


ఎంవీపీ కాలనీ : ప్రతిజ్ఞ చేస్తున్న సత్యసాయి విహార్ విద్యార్థులు


వెంకోజీపాలెం : అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, కమిషనర్ సంపత్‌కుమార్ తదితరులు

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడతాం

రాజ్యాంగ దినోత్సవంలో పలువురు ప్రతిజ్ఞ

భారత రాజ్యాంగ 75వ దినోత్సవాన్ని పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. మంగళవారం వివిధ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని రాజ్యాంగ విశిష్టత, రాజ్యాంగం రూపొందించిన విధానం, రాజ్యాంగం పట్ల దేశ ప్రజల బాధ్యత తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెచ్ అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు.

ఆరిలోవ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బాబా సాహెబ్ డా.అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం చాలా గొప్పదని, దాని వల్లే మనం హక్కులు పొందగలిగి స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 12వ వార్డులోని పెదగదిలిలోగల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను స్ఫూర్తి ప్రదాతగా పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, పార్లమెంటరీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవింద్, నేతలు గాడి సత్యం, ఒమ్మి పోలారావు, మద్దిల రాజశేఖర్ పాల్గొన్నారు. పదో వార్డులో గల ఇందిరానగర్‌లో గ్రామాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మద్దిల రాజశేఖర్, గాడు అప్పలనాయుడు, వైవీ రావుపాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం : ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెయిర్ భారత రాజ్యాంగంపై అవగాహన పెంచే అనేక కార్యక్రమాలతో సంవిధాన్ దివాస్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలు గోరపల్లి గ్రామ సచివాలయం వెల్ఫేర్ ఇంజనీరింగ్ కళాశాల, హైస్కూల్ ఆధ్వర్యంలో ఏయూ ఆవరణలోని అంబేడ్కర్ చెయిర్ వద్ద నిర్వహించారు. స్కూల్ నుంచి 80 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా ప్రీ అంబుల్ చదవడం చేశారు.కార్యక్రమంలో స్కూలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సమైక్యత సమగ్రతకు రాజ్యాంగమే మూల కారణమని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ ఎస్సీఎస్టీ బీసీ-సీ టీచర్స్, ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతదేశాన్ని ఐక్యం చేసి ప్రజలందరికీ సమాన హక్కులను రాజ్యాంగం అందించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో విశాఖ కేంద్ర ప్రాంతీయ సంచాలకుడు ఆచార్య గోనిపాటి ధర్మారావు తదితరులు అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఏయూ రాజనీతి శాస్త్ర విభాగం, ఇనిస్టిట్యూట్ ఫర్ డెమొక్రటిక్ ఎంగేజ్మెంట్ అండ్ అకౌంటబులిటీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించాయి. రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఏయూ వీసీ శశిభూషణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, విశ్రాంత ఆచార్యులు కోటి జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి విద్యా విహార్‌లో మంగళవారం ఘనంగా భారత రాజ్యాంగ దినో త్సవాన్ని నిర్వహించారు. పాఠశాల అసెంబ్లీ సమయంలో వందలాది మంది విద్యార్థులు ఏక కంఠంతో ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు రాజ్యాంగం గొప్పతనాన్ని వర్ణిస్తూ ఆలోచింపచేసే ప్రసంగాలు చేశారు.ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక నగర శాఖ గ్రంథాలయంలో సచివాలయం వైద్య కార్యదర్శి సుభాషిణి తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయాధికారి కే వీఏ ఉమామహేశ్వరరావు, పాఠకులు పాల్గొన్నారు.

సంక్షేమ భవన్‌లో రాజ్యాంగంలో పేర్కొన్న అంశాల ఆధారంగా ఆశయాలు, లక్ష్యాల విలువలకు కట్టుబడి ఉంటామని అధికారులు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, ఎస్సీ కార్పొరేషన్, డీటీసీడబ్ల్యూవో, జీఎస్‌డబ్ల్యూఎస్, సోషల్ వెల్ఫేర్ శాఖల నుంచి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత మాట్లాడుతూ దేశంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా అందరికీ అన్ని రంగాల్లో సమాన అవకాశాలు వస్తున్నాయంటే అది రాజ్యాంగ గొప్పతనమేనన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు రాజ్యాంగ ప్రవేశిక సామూహిక పఠనం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణారావు, సుష్మ, సన్యాసిరావు, సూర్యకుమారి, వేదవ్యాస్ పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్యాలయంలో..

వెంకోజీపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పేదలు, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలు అందరూ మంచి జీవన విధానాన్ని పొందేలా రాజ్యాంగాన్ని బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ రూపొందించారని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆమె కమిషనరు డాక్టర్ పి.సంపత్‌కుమార్‌లతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

బీజేపీ కార్యాలయంలో..

పెదవాల్తేరు : బీజేపీ నగర కార్యాలయంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రాకేష్ చంద్ర గనిరెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర పాల్గొని అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. కొరగిరి సుహాసినిఆనంద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధానేశ్వర రావు, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతాడ మోహన్ రావు పాల్గొన్నారు.

ఘనంగా ఆవంత్స సోమసుందర్, ఆరుద్ర శత జయంతి ఉత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :ఆవంత్స సోమసుందర్, ఆరుద్ర శత జయంతి ఉత్సవాలు ఏయూ తెలుగుశాఖ, అరసం సంయుక్తంగా ఏయూలో నిర్వహించడం ఆనందకరమని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. మంగళవారం ఏయూ టీఎల్ఎన్ సభా హాలులో తెలుగు శాఖాధిపతి జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగింది. అరసం ప్రచురించిన 'ఆరుద్ర కవిత'ను ఆవిష్కరణ చేసిన అనంతరం వీసీ మాట్లాడుతూ వీరిద్దరూ తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహానుభావులన్నారు. కార్యక్రమంలో విశాఖ కామ్రేడ్ వై.విజయకుమా మార్కిస్ట్, అధ్యయన కేంద్రం నిర్వాహకులు జేవీ సత్యనారాయణమూర్తి, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్, ఆచార్య చందు సుబ్బారావు, అరసం నేతలుపాల్గొన్నారు.

పారదర్శకంగా హెచ్‌సీ, ఎస్ఐ ట్రైనింగ్ పరీక్షలు

సిరిపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం రేంజ్ పరిధిలోని విశాఖపట్నం సిటీ, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన హెచ్‌సీలు, ఏఎస్ఐలకు ఎస్ఐ ట్రైనింగ్ వెళ్లేందుకు మొత్తం 40 మందికి రెండు రోజులు పాటు అర్హత పరీక్షలను రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, 5వ బెటాలియన్ కమాండెంట్ మల్లికా ఆధ్వర్యంలో అవుట్ డోర్, మౌఖిక పరీక్షలైన సిబ్బంది టర్న్ అవుట్, స్క్వాడ్రిల్, ఆయుధ కవాతు, ఆయుధాలు ఖోల్నా-జోడ్నా, నేర స్థల పరిశీలన చేసే విధానం, వైవా పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించారు. ఈ పరీక్షలను డీఐజీ గోపీనాథ్ జెట్టీ పరిశీలించారు.

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

మహారాణిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్ వద్ద సముద్రంలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మంగళవారం ఉదయం ఫిషింగ్ హార్బరులోని పదో నెంబరు జెట్టీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి కుడి కాలుకు బలమైన గ్రానైట్ రాయి కట్టి ఉన్న మృతదేహం సముద్రంలో తేలుతూ కనిపించటంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి కేజీహెచ్ శవాగారానికి తరలించి కేసు నమోదు చేశారు. కాలుకు బలమైన రాయి కట్టి ఉండటంతో ఎవరో కావాలనే హత్య చేసి సముద్రంలో పడవేశారని భావిస్తున్నారు. అతడు ఎవరన్నది గుర్తించేందుకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

సాగర తీరంలో రన్ ఫర్ అంబేడ్కర్

రామ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి ఫలాలు భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించాయని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆర్కే బీచ్‌లో ఎస్సీఎస్టీబీసీ మైనారిటీ అలుమ్ని వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం అధ్యాపకులు, విద్యార్థులతో రన్‌ఫర్ అంబేడ్కర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కోటిజాన్, ఆరేటి మహేష్, బి.మోహన్‌బాబు, సుధీర్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్

12వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు అన్నారు. జీవీఎంసీ 12వ వార్డులోని లీలా సుందరయ్యనగర్‌లో 87.85 లక్షలతో నిర్మించనున్న రోడ్లు, డ్రైన్ల పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడతూ అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. స్థానికంగా ఏవైనా సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు, పి.ధర్మారావు, యల్లమల్లి సురేశ్, ఒమ్మి పోలారావు, ఈఈ శాంతారావు, డీఈ అప్పారావు, ఏఈ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఏయూ హిందీ విభాగం సాహిత్య విద్యా పర్యటన

వెంకోజీపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏయూ హిందీ విభాగాచార్యులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు బుధవారం నుంచి డిసెంబరు 4వరకు హిందీ సాహిత్య విద్యా పర్యటన చేయనున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఏయూలో ప్రచారాన్ని చేపట్టారు. వారణాసిలో ఉన్న ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, గ్రంథాలయ సందర్శన ఈ విద్యా పర్యటన ముఖ్య ఉద్దేశమని వక్తలు తెలిపారు. హిందీ సాహిత్య రథసారథులైన ప్రముఖ హిందీ సాహిత్య కారులైన 'నాటక్ సామ్రాట్' జయశంకర్ ప్రసాద్, 'ఉపన్యాస్ సామ్రాట్' ప్రేమ్‌చంద్, భక్తి సాహిత్యంలో ప్రసిద్ధ సంత్ కవి కబీర్, 'హిందీ సాహిత్యంలో భారతీయ చరిత్రకారుడు' రామచంద్ర శుక్ల, 'ఆధునిక హిందీ సామిత్య పితామహుడు' భారతెందు హరిశ్చంద్రుల నివాస స్థలాల పర్యటనతో పాటు, ఢిల్లీలోని కేంద్రీయ హిందీ సంస్థాన్‌ను వివిధ చారిత్రక ప్రదేశాల సందర్శన, చివరగా ఆగ్రాలోని కేంద్రీయ హిందీ సంస్థాన్, విశ్వ వింతలలో ఒకటైన అత్యంత ఆకర్షణీయమైన తాజ్ మహల్ కూడా సందర్శించనున్నట్లు తెలిపారు.


పర్యటనపై ప్రచారాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులు

నరవకు బస్సులు నడపాలి

పీడీఎస్వో డిమాండ్



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆందోళన చేస్తున్న పీడీఎస్వో కార్యకర్తలు

మద్దిలపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నరవ ప్రాంతంలో ఉన్న జూనియర్ కళాశాలల సమయానికి ఆర్టీసీ బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్వో కార్యకర్తలు మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్వో రాష్ట్ర కమిటీ సభ్యుడు యస్.రుద్రి మాట్లాడుతూ నరవ ప్రాంతంలో రెండు జూనియర్ కళాశాలలు ఉన్నాయని, ఆ కళాశాలల సమయానికి బస్సులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్ఏడీ సుమారు పదిపదిహేను కిలోమీటర్లు విద్యార్థులు సైకిళ్లపై కళాశాలలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొంతమంది రూ.50 నుంచి రూ70 ఖర్చు చేసి ఆటోల్లో వెళ్లాల్సి వస్తోందన్నారు. అందుకే ఉదయం 8-9 గంటలు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల మధ్యలో ఆర్టీసీ బస్సులు నడపాలని కోరారు. అనంతరం ఆర్టీసీ ఆర్ఎం కు వినతిపత్రం అందించారు.

ఏయూలో అక్రమాలపై విచారణ కమిటీ వేస్తాం

వెంకోజీపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో మాజీ వీసీ ప్రసాదరావురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అన్యాయాలు, అక్రమాలు, ఆర్థిక లావాదేవీలపై విచారణ కమిటీని త్వరలో ఏర్పాటు చేస్తామని తనను కలిసిన ఏయూ టీచర్ సభ్యులకు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వంశీకృష్ణను ఏయూ టీచర్ జేఏసీ సభ్యులు కలిసి యూనివర్సిటీ విషయాలపై చర్చించారు. ముఖ్యంగా 2019-24 మధ్యలో జరిగిన అన్యాయాలు, అక్రమాలు ఆర్థిక అవకతవకలపై విచారణ కమిటీ త్వరలో నియమిస్తామని, అదే రకంగా ప్రసాదరావు రెడ్డి సైన్యాన్ని వెనక్కు పంపించేస్తామని తెలిపారు.

ఏయూకు విచ్చేసిన ఎమ్మెల్యేలు, ఎంపీ ఇచ్చిన హామీలను రాజశేఖర్‌రెడ్డి విగ్రహం కూడా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని జేఏసీ సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.సురేష్‌మీనన్, డాక్టర్ ప్రేమానందం డాక్టర్ అర్జునుడు, డాక్టర్ హరి డాక్టర్ రమేష్, డాక్టర్ దాస్, డాక్టర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


వంశీకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న టీచర్లు



సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)

● **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **లక్ష్మీభాస్కర్:** వెంకటేశ్వర

● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 56, టమాటా 42, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 35, క్యాబేజి 36, క్యారెట్ 76 దొండకాయలు 32, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 34, కంద 60, దేముడు చిక్కుడు 60, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

బాల్యం కేంద్రాల నిర్వహణకు దాతలు సహకరించాలి

వెంకోజీపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో బాల్యం విద్యా కేంద్రాల నిర్వహణకు చేయూత ఇచ్చేందుకు దాతలు ముందుకు రావాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన జీవీఎంసీ పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా నడుపబడుచున్న బాల్యం విద్యా కేంద్రాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి అందించిన యూనీఫారం క్లాత్, స్థానిక దాతల ద్వారా సేకరించి నిధులతో కుట్టించిన యూనీఫారం, స్కూల్ బెల్ట్, స్కూల్ షూ, సాక్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాల్యం విద్యా కేంద్రాల్లో నమోదయ్యే 3 నుంచి 5 సంవత్సరాల విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో ఆటలు, పాటలుతో కూడిన విద్యా బోధన అందించేందుకు ఇంకా ఎక్కువ మంది దాతలు ముందుకు రావాలని కమిషనర్ కోరారు. విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి, స్థానిక దాతలు, బాల్యం విద్యా పథకం ప్రారంభించిన అనంతరం ఇటువంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్న జీవీఎంసీ బాల్యం విద్యా పథకం సహాయకులు ఆవుపాటి మోహన్ కుమార్‌ను కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, బాల్యం విద్యా కేంద్రాల సూపర్‌వైజర్ సూర్యనారాయణ, బాల్యం అధ్యాపకులు, బాల్యం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు


చిన్నారులకు యూనీఫారాలు అందజేస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

అదృశ్యం కేసులు ఛేదించిన పోలీసులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గడచిన రెండు రోజులుగా నమోదైన అదృశ్యం కేసులను ఎంవీపీ పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేసి, ఛేదించారు. ఆయా కేసుల్లో కనిపించడం లేదని పేర్కొన్న తొమ్మిది మందిని తిరిగి బంధువులకు పోలీసులు అప్పగించారు. వివిధ కారణాలతో ఒకే కుటుంబంలోని నలుగురు అదృశ్యం అయినట్లు కేసు నమోదు అయింది. మరో కేసులో ఇద్దరు, ఇంకొక కేసులో ముగ్గురు కనిపించడం లేదనే కేసుల్లో సీఐ మురళీ పర్యవేక్షణలో ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బంది వీరి ఆచూకీ కనుక్కొని, బంధువులకు అప్పగించారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆరిలోవ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 8న గురజాడ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నమాలల గర్జన సభకు మాలలు అంతా తరలిరావాలని కోరుతూ 13వ వార్డులో గల రామకృష్ణాపురంలో మంగళవారం సాయంత్రం పోస్టర్ ఆవిష్కరించారు.



రైళ్లు రద్దు...రీ షెడ్యూల్

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన రద్దీ, ఇతర సాంకేతిక కారణాల వల్ల రాయగడ-విజయనగరం మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్టు అధికార వర్గాలు మంగళవారం తెలిపాయి. వారానికి రెండుసార్లు నడిచే విశాఖపట్నం-కోరాపుట్ (నంబర్ 18512) రైలు ఈ నెల 29 నుంచి డిసెంబరు 2 వరకూ రద్దయింది. అలాగే అటు నుంచి వచ్చే 18511 నంబర్ రైలు నవంబరు 30 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు రద్దయింది. విశాఖపట్నం నుంచి కోరాపుట్ వెళ్లే పాసింజర్ రైలు (08546)ను 29వ తేదీ నుంచి డిసెంబరు 4 వరకు రద్దు చేశారు.

అటు నుంచి వచ్చే రైలు (08545) నవంబరు 29 నుంచి డిసెంబరు 5 వరకూ రద్దయింది. గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) 28వ తేదీ నుంచి డిసెంబరు 3 వరకు రద్దయింది. అటు నుంచి వచ్చే 17244 నంబరు రైలు 29 నుంచి డిసెంబరు 4 వరకు రద్దు చేశారు.

రీషెడ్యూల్ చేసిన రైళ్లు

- నాందేడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (20810 నంబరు) నవంబరు 30, డిసెంబరు 2, 3 తేదీల్లో సాయంత్రం 4.30 గంటలకు బదులు నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయలుదేరుతుంది. దుర్గ్-విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20829) 29 నుంచి డిసెంబరు 4 వరకు రెండు గంటలు ఆలస్యంగా ఉదయం 7.45 గంటలకు బయలుదేరుతుంది. కోయంబత్తూరు-ధన్‌బాద్ స్పెషల్ రైలు (06063) 29న రెండు గంటలు ఆలస్యంగా 1.50 గంటలకు బయలుదేరుతుంది. ఈరోడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (08312) 29న రెండు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 3.45 గంటలకు బయలుదేరుతుంది. బరంపూర్-సూరత్ స్పెషల్ (09060) రైలు 29న ఐదు గంటలు ఆలస్యంగా ఉదయం 9.30 గంటలకు బయలుదేరుతుంది. కోయంబత్తూర్-బరౌని రైలు (06059) డిసెంబరు 3న రెండు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 1.50 గంటలకు బయలుదేరుతుంది. విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్ సమతా ఎక్స్‌ప్రెస్ (12807) నవంబరు 30, డిసెంబరు 1, 3, 4 తేదీల్లో నాలుగు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరుతుంది. అటు నుంచి వచ్చే రైలు (నంబర్ 12808) 28, 29, 30, 2, 3, తేదీల్లో నాలుగు గంటలు ఆలస్యంగా ఉదయం 11 గంటలకు బయలుదేరుతుంది. విశాఖపట్నం-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (నంబర్ 22847) వయా రాయగడ డిసెంబరు 1న నాలుగు గంటలు ఆలస్యంగా ఉదయం 8.20 గంటలకు బయలుదేరుతుంది. విశాఖపట్నం-దుర్గ్ వందేభారత్ రైలు (20830) 29 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు 1.20 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.50 గంటలకు బయలుదేరుతుంది.

షిప్‌యార్డును సందర్శించిన తోషిబా బృందం


షిప్‌యార్డు అధికారులతో సమావేశమైన తోషిబా బృందం

మల్కాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హిందుస్తాన్ షిప్‌యార్డును జపాన్ కు చెందిన తోషిబా బ్యాటరీ కంపెనీ సభ్యుల బృందం మంగళవారం సందర్శించింది. అధునాతన ఇంధన నిల్వ పరిష్కారాలను అన్వేషించే చొరవలో భాగంగా ఈ బృందం షిప్‌యార్డుకు రావడం అభినందనీయమని అధికారులు తెలిపారు. బ్యాటరీ సెల్స్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్ గ్రూప్ హెడ్స్‌తో గోరి-సాన్ తోషిబా ఇండియా డైరెక్టర్ కజుటకా నిషిమురా-సాన్, సేల్స్ ఇన్‌చార్జి రాకేష్ ఠక్రూ బృందం చర్చించింది. సముద్ర వాతావరణ అనుకూలతకు హెచ్ఎస్ఎల్, తోషిబా ఎల్‌డబ్ల్యూటీ మధ్య జరిగే ఒప్పందంతో అధునాతన బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్‌ను అభివృద్ధి చేయవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోరిసాన్ మాట్లాడుతూ దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన షిప్‌యార్డుతో కలిసి పనిచేయడం, సముద్ర రంగానికి తోషిబా అత్యాధునిక పరిష్కారాలను ప్రవేశపెట్టడానికి ఇది అద్భుతమైన అవకాశమన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

» **కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన**


ప్రదర్శనగా సాగుతున్న కార్మిక సంఘాల నాయకులు

సిరిపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా మంగళవారం భారీ ప్రదర్శన నిర్వహించాయి. రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌తో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చర్యలను ఆపాలన్నారు. కార్మికులకు నష్టం చేసి బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దుచేయాలన్నారు. అసంఘటిత రంగం కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కార్మికులు పెద్దఎత్తున పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని తన విధానాలను మార్చుకోకపోతే నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలన్నారు. ఈ ప్రదర్శనలో మునిపిపల్, ముఠా, బిల్డింగ్, ఆటో, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, వీవోఏ, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎంశ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, ఆర్కేఎస్వీకుమార్, మణి, జగన్, ఆదినారాయణ, రెహమాన్, మంత్రి రాజశేఖర్, బి.నాగభూషణం, రామచంద్రరరావు, ఎం.వెంకటేశ్వర్లు, కనకారావు, తిరుపతి, వాసుదేవరావు పాల్గొన్నారు.

మార్గశిర ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఈవో, తదితరులు

జగదాంబకూడలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసోత్సవాలకు కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. గర్భగుడి నుంచి టౌన్ కొత్తరోడ్డు వరకు క్యూలైన్లు, పందిళ్ల వేస్తున్నారు. ప్రముఖులు, ఉచిత, టికెట్ దర్శనాలకు వేర్వేరుగా క్యూలైన్లు సిద్ధం చేశారు. దర్శనానంతరం బయటకు వచ్చేందుకు కొత్తరోడ్డు వైపు బారికేడ్లు నిర్మించారు. కాగా ఉత్సవ గోడ పత్రికను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం ఆయన నివాసంలో ఆవిష్కరిం చారు. తొలి గురువారం సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు నిర్వహించే పంచామృతాభిషేకం తొలి టికెట్ కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో కె.శోభారాణి, కార్యనిర్వాహక ఇంజనీరు సీహెచ్‌వీ రమణ, ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారికి మంగళవా రం అష్టదళ పద్మారాధన సేవలను నిర్వహించారు. 108 స్వర్ణ పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి : సీపీ


బహుమతి అందజేస్తున్న పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి

మహారాణిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు రాజ్యాంగాన్ని గౌరవించాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. రెల్లివీధిలో యువసేన ఆధ్వర్యంలో రాజ్యాంగ వజ్రోత్సవాలను మంగళవారం నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బండి సురేంద్ర, వెంకటరావు, లక్ష్మణరావు, సింహాద్రినాయుడు, ఏఎస్ఐ అనురాధ, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు రైల్వే డివిజన్‌లో...

విశాఖపట్నం: వాల్తేరు రైల్వే డివిజన్‌లో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. డివిజనల్ రైల్వే మేనేజర్స్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అంతకుముందు అధికారులు సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ఇ.శాంతారామ్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెక్యూరిటీని వెనక్కి తీసుకోండి

» **డీజీపీకి శారదా పీఠం లేఖ**

పెందుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అధిక సమయం రుషికేశ్‌లో ఉంటున్నందున ఆయన భద్రత కోసం కేటాయించిన గన్‌మెన్ (వన్ ప్లస్ వన్)ను వెనక్కి తీసుకోవాలంటూ డీజీపీని పీఠం లేఖ ద్వారా కోరింది. ఈ మేరకు మంగళవారం పీఠం జనరల్ మేనేజర్ పి.కిషోర్‌కుమార్ పేరిట డీజీపీ, డీజీ ఇంటెలిజెన్స్, విశాఖ సీపీకి లేఖలు అందజేసింది. రుషికేశ్‌లో ఉన్నందున సెక్యూరిటీ అక్కరలేదని పీఠాధిపతి భావిస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు.

'పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించొద్దు'

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణను నిలిపివేయాలని ప్రజావేగు గుండు అప్పలరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పోర్టులో పనిచేసి పదవీ విరమణ చేసిన 12వేల మందితో పాటు మొత్తం 40వేల మంది సేవలు పొందుతున్నారన్నారు. 80 పడకల నుంచి 300 పడకలకు పెంచి, సూపర్ స్పెషాల్టీగా మార్చి, నిర్వహణకు ప్రైవేటు సంస్థకు ఇవ్వాలని పోర్టు యాజమాన్యం నిర్ణయించిందన్నారు. దీనికి టెండర్లు పిలిచినా కార్మిక సంఘాలకు సమాచారం ఇవ్వలేదన్నారు. ఈ చర్యలను నిరసిస్తూ రెండు నెలలుగా ఆస్పత్రి ఎదుట కార్మిక సంఘాలు ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యం స్పందించడం లేదన్నారు. ఆస్పత్రిని ఆధునికీకరించాలని, కానీ పోర్టు యాజమాన్యమే నిర్వహించాలని, ప్రైవేటు సంస్థకు ఇవ్వకూడదని, ఈ మేరకు తగిన సూచనలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

భీమిలి ఉత్సవ్ వాయిదా

సిరిపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఒకటో తేదీన జరగాల్సిన భీమిలి ఉత్సవ్‌ను వాయిదా వేసినట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఉత్సవ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు చేసేందుకు తగిన సమయం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో వెల్లడిస్తామన్నారు.

నేవీ మారథాన్‌కు విస్తృత ఏర్పాట్లు


మారథాన్ ఏర్పాట్లను కమిషనర్‌కు వివరిస్తున్న నేవీ అధికారి

వెంకోజీపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో డిసెంబరు 15న నిర్వహించనున్న వైజాగ్ నేవీ మారథాన్ ఏర్పాట్లను జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. నేవీ కెప్టెన్, రేస్ డైరెక్టర్ టీఆర్ఎస్‌కుమార్, అధికారులతో కలిసి ఆర్.కె.బీచ్ సమీప ప్రాంతాలను పరిశీలించారు. మారథాన్ 42 కిలోమీటర్లు రన్ ఆర్కేబీచ్ నుంచి భీమిలి వరకు నిర్వహించనున్నందున ఏర్పాట్ల వివరాలను నేవీ కెప్టెన్‌ను అడిగి తెలుగుసుకున్నారు. తాగునీరు, విద్యుత్, బార్కేడింగ్, అంబులెన్స్‌లు, పార్కింగ్, హోర్డింగ్స్, డిజిటల్ స్క్రీన్స్ నేవీ తరఫున ఏర్పాటు చేస్తామని, దానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా పారిశుధ్య సిబ్బందిని, ఫైర్ సేఫ్టీ వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన కమిషనర్ అధికసంఖ్యలో క్రీడాకారులు పాల్గొంటారని, జీవీఎంసీ తరఫున అన్ని అనుమతులు మంజూరు చేయడంతో పాటు, తగిన సహకారం అందించాలని ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద్‌రాజు, సీసీపీ ఎ.ప్రభాకర్‌రావు, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌లను ఆదేశించారు.

భోజన పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

» **కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్**

» **తోటగరువు ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ**


మధ్యాహ్న భోజనం అమలును పరిశీలిస్తున్న కలెక్టర్

ఆరిలోవ, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. తోటగరువు ఉన్నత పాఠశాలను మంగళవారం మధ్యాహ్నం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం అమలు తీరును తెలుసుకున్నారు. భోజనం వడ్డించే ప్రదేశం అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రీడా ప్రాంగణంలో చెత్త పేరుకుపోవడంపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఆరోగ్యకర వాతావరణంలో మధ్యాహ్న భోజనం తయారు చేసి అందించాలని సూచించారు. క్రీడా స్థలాన్ని ఆటలకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. భోజన పథకం, పాఠ్యాంశాల బోధన తదితర అంశాలపై ప్రశ్నించారు. కలెక్టర్ వెంట డీఈవో, ఎంఈవో, ఇతర అధికారులున్నారు.

యూపీహెచ్‌సీలో ఓపీ సంఖ్య పెరగాలి

అనంతరం కలెక్టర్ ఆరిలోవ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అందుతున్న పరిశీలించారు. ఓపీ సంఖ్య, మదుల నిల్వలను సరిచూశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.